PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 225 | విజయవాడ, శనివారం 18 మార్చి 2023 | 8 + 6 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 18 March 2023 | Rs

సిజెఐపై ట్రోలింగ్ ఆపండి

- ట్రోలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రతిపక్ష ఎంపీల లేఖ

● లోపలి పేజీలో.. ●

గెలిపించిన రాహుల్, జడేజా



- పేసర్ల దెబ్బకు ఆసీస్ కుదేల్..
- తొలి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు

● లోపలి పేజీలో.. ●

తొమ్మిదేళ్లైనా పట్టించుకోరా?

- పెండింగ్ హామీలపై ఇకనైనా దృష్టి
- పోలవరానికి రూ.10 వేల కోట్లు ఇవ్వాలి
- మోడీ, అమిత్‌షాతో జగన్ భేటీ



ప్రధాని మోడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లైనా ఇప్పటి వరకు రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏపి, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన చాలా ద్వైపాక్షిక అంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటిపై వెంటనే దృష్టి సారించాలి" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోరారు. పార్లమెంట్‌లోని ప్రధాన మంత్రి కార్యాలయంలో ప్రధాని మోడీతో సిఎం ఏకాంతంగా భేటీ అయ్యారు. దాదాపు 35 నిమిషాల పాటు భేటీ సాగింది. అనంతరం సిఎం జగన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సుమారు 30 నిమిషాలపాటు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధానితో ఆయన చర్చించారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై కేంద్రం ఆర్థికశాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేసినప్పటికీ, కీలక అంశాలన్నీ ఇంకా పెండింగులోనే ఉన్నాయని తెలిపారు. 2014-15 నాటి రెవెన్యూ లోటు కింద పెండింగ్‌లో ఉన్న రూ.36,625 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని సిఎం కోరారు. రుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేసిన రూ.2,600.74 కోట్లు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను వెంటనే విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు అంచనాలను సాంకేతిక సలహా కమిటీ నిర్ధారించిన రూ.55,548 కోట్లను వెంటనే ఆమోదించాలని కోరారు. తాగునీటి సరఫరా అంశాన్ని కూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్ వారీగా నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలని, ఆలస్యం అవుతున్న కొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగిపోతుందని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లారు. నగదు బదిలీ (డిబిటి) పద్ధతిలో ముంపు బాధితులకు పరిహారమందిస్తే జాప్యాన్ని నివారించవచ్చని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారుల ఎంపికలో హేతుబద్ధత పాటించకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. దీనివల్ల పిఎంజికెఎవై కార్యక్రమం కిందకు రాని 56 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా రేషన్ ఇవ్వడం వల్ల దాదాపు రూ.5,527 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తి సరైనదేనని నీతి ఆయోగ్ కూడా అభిప్రాయపడిన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలకు వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు ఖనిజ కొరత లేకుండా ఎపిఎండిసికి గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

జాబ్ కేలండరు విడుదల చేయాలి

- మండలిలో పిడిఎఫ్ వాయిదా తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా జాబ్ కేలండరు విడుదల చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని శాసన మండలిలో ఛైర్మన్ కె మోషేను రాజుకు పిడిఎఫ్ సభ్యులు కె లక్ష్మణరావు, షేక్ సాబ్జీ మండలిలో శుక్రవారం వాయిదా తీర్మానం అందజేశారు. అధికారంలోకి వస్తే ప్రతిఏటా జాబ్ కేలండరు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఈ నాలుగేళ్లలో ఇప్పటి వరకు కేవలం 10,134 పోస్టులతో ఒక ఏడాది మాత్రమే కేలండరు విడుదల చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వంలో 2 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని చెప్పారు. వివిధ శాఖల్లో ఖాళీ పోస్టులన్నిటినీ అవుట్‌సోర్సింగ్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నారని తెలిపారు. జాబ్ కేలండరులో భాగంగానే రాష్ట్రంలోని 25 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నిర్వహించాలన్నారు. ఈ అంశంపై చర్చ జరపాలని కోరారు. ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ చెప్పారు. నిరుద్యోగులకు సంబంధించిన అంశంపై చర్చ జరపాలని సభ్యులు పట్టుబట్టినా ఛైర్మన్ అంగీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా 2004 సెప్టెంబరు 1 కంటే ముందు ఎంపికైన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా ప్రభుత్వాన్ని కెఎస్ లక్ష్మణరావు కోరారు. 2004 సెప్టెంబరు 1 కంటే ముందే డిఎస్‌సి-2003 ద్వారా 7 వేలమంది, ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్-2 ఉద్యోగులు కలిపి 3 వేల వరకు ఉంటారని వివరించారు. వీరికి ఒపిఎస్ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్కారుకు పట్టభద్రుల సెగ

- ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమలో టిడిపికి భారీ అధిక్యత
- పశ్చిమ రాయలసీమలో హోరాహోరీ

ప్రజాశక్తి- యంత్రాంగం

శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్రమైన ఎదురుగాలి వీచింది. ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమల్లో కడపటి వార్తలందేసరికి టిడిపి అభ్యర్థులు భారీ ఆధిక్యతలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమలో ఆ రెండు పార్టీల మధ్య హోరాహోరీ నెలకొంది. తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోని 108 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. కాగా, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల్లోనూ వైసిపి గెలుపొందింది. ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయానికి చేరువలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఆయనకు 82,977 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ 55,749 ఓట్లతో రెండో స్థానంలో ఉన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో మేజిక్ ఫిగర్ ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రయార్టీ ఓట్లను లెక్కిస్తున్నారు. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ సహా 2,13,035 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 12,318 ఓట్లు చెల్లలేదు. మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ, బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్‌కు 10,884 ఓట్లు మాత్రమే వచ్చాయి.

తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు) శాసన మండల పట్టభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి భారీ ఆధిక్యతలో ఉన్నారు. ఆయనకు 1,12,514కు ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి 85,252 ఓట్లు పోలయ్యాయి. పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి 38,001 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి సన్నారెడ్డి దయాకరరెడ్డికి 6,341 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ నియోజక వర్గంలో 2,69,339 పోలయ్యాయి. వీటిలో 20,979 ఓట్లు చెల్లలేదు. ఇక్కడ 22 మంది పోటీ చేశారు. ఏ అభ్యర్థికీ

మిగతా 6లో

ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో వైసిపి గెలుపు



రామచంద్రారెడ్డి



చంద్రశేఖర్ రెడ్డి

రాష్ట్రంలోని రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ స్వల్ప ఆధిక్యతతో వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల వరకూ కొనసాగింది. తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలు) ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వైసిపి అభ్యర్థి పర్వత చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. ఆయనకు పిడిఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో మేజిక్ ఫిగర్ ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో 1043 ఓట్ల ఆధికత్యను చంద్రశేఖర్‌రెడ్డి సాధించారు. మొత్తం 24,291 ఓట్లకుగానూ ఆయను 11,714 ఓట్లు, బాబురెడ్డికి 10,671 ఓట్లు వచ్చాయి. 1906 ఓట్లు చెల్లలేదు. మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు) ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా వైసిపి అభ్యర్థి ఎంవి.రామచంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యతతో గెలుపొందారు. ఆయనకు ఎపిటిఎఫ్ మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఒంటేరి శ్రీనివాసరెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యతలో ఎంవి.రామచంద్రారెడ్డికి ఆధికత్య సాధించనప్పటికీ మేజిక్ ఫిగర్ సాధించలేకపోయారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలో శ్రీనివాసరెడ్డి పుంజుకున్నారు. దీంతో, ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరికి 169 ఓట్ల స్వల్ప మెజార్టీతో రామచంద్రారెడ్డి విజయం సాధించారు. ఆయనకు 10,787 ఓట్లు వచ్చాయి. శ్రీనివాసరెడ్డికి 10618 ఓట్లు తెచ్చుకున్నారు. ఇద్దరిలోనూ ఎవరికి 50 శాతానికిపైగా ఓట్లు రానప్పటికీ ఎలిమినేషన్ పూర్తయ్యే సమయానికి అత్యధిక ఓట్లు కలిగిన ఎంవి.రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించారు. పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టంగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి 4,162 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ అనిల్ వెంకట ప్రసాద్‌రెడ్డికి 3212, జి.వి.నారాయణరెడ్డికి 1345 ఓట్లు వచ్చాయి. మొత్తం 25,879 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 608 ఓట్లు చెల్లలేదు. 25,271 ఓట్లను వాలిడ్‌గా గుర్తించారు.

రహదారుల్లో గోతులు..నూతులు

- రోడ్ల దుస్థితిపై అధికారపక్ష సభ్యుల అసంతృప్తి
- ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారంటూ ఆగ్రహం



మహేష్ రెడ్డి



కరణం ధర్మశ్రీ



అబ్బయ్య చౌదరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రహదారుల నిర్వహణపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో గళమెత్తారు. నాలుగేళ్ల నుంచి పలు రహదారుల పరిస్థితి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. మంజూరైన రహదారులకు సైతం పనులు వేగవంతంగా జరగడం లేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా అధికార పార్టీ సభ్యుల నుంచి ప్రభుత్వానికి ప్రశ్నలు ఎదురయ్యాయి. సహజంగా రోడ్లు బాగాలేవని, నిర్వహణ సరిగ్గా లేవని, ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీల సభ్యుల ఆరోపణలు, విమర్శలు చేయడం సహజం. ఇందుకు భిన్నంగా అధికార పార్టీ సభ్యులే రహదారుల నిర్వహణకు నిధులపై గళమెత్తడం గమనార్హం.

ఇదే అంశంపై చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలోని చోడవరం ఎన్‌డిబి రోడ్డును సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.120 కోట్లతో మంజూరు చేశారని, ఈ రహదారి గంగవరం నుంచి రోలుగుంట, నర్సీపట్నం వరకు ఉంటుందని, పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. ఈ రహదారిపై గోతులు కాదు.. అవి నూతులుగా మారకముందే పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ విషయాన్ని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లానని, కాంట్రాక్టరును పిలిపించి మంత్రి మాట్లాడినా పనులు నత్తనడకనే సాగుతున్నాయన్నారు.

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ.. ఎన్‌డిబి ఫేజ్-1 పనులు వేగవంతం చేయాలని, ఎన్‌డిబి ఫేజ్-1 లెఫ్ట్ ఓవర్‌లో నూజివీడు-ఏలూరు వయా కొప్పాక ఎన్‌డిబిలో మంజూరు చేశారని ప్రభుత్వం అడ్మినిస్ట్రేషన్ మంజూరు చేయాలని కోరారు. వట్లూరు అండర్‌పాస్ ఎల్‌సి 343 అప్రూవల్ అయి ఉందని, రైల్వే పోర్షన్ పూర్తయ్యిందని, (ఆర్‌యుబి) ప్రభుత్వం అప్రోచ్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గురజాల, మాచవరం మండలాలు అద్దంకి- నార్కెట్‌పల్లి హైవేకు దూరంగా ఉంటాయని, మాచర్ల-నడికుడి వరకు పనులు మాచవరం మండలం ఎన్‌డిబికి రూ.30 కోట్లతో మంజూరు చేశారని, బ్రాహ్మణపల్లి నుంచి రేకులపల్లి వరకు రహదారి టెండర్లు త్వరగా పిలవాలని కోరారు.

నత్తనడకన పనులు నిజమే



చోడవరంలో ఎన్‌డిబి పనులు నత్తనడకన సాగుతున్న మాట నిజమేనని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. పనులు వేగవంతంగా చేయకుంటే కాంట్రాక్టను రద్దు చేస్తామన్నారు. నాలుగేళ్లుగా 19-20, 20-21, 22-23లో ప్రభుత్వం రూ.3,824.75 కోట్లు రాష్ట్ర రహదారులకు, రూ.1,581.15 కోట్లు, రూ.2,243.60 కోట్లు జిల్లా మేజరు రహదారులకు ఖర్చు చేసిందన్నారు. నాలుగేళ్ల కాలవంలో 7,750 కిలోమీటర్లు రహదారుల పొడవు పునరుద్ధరించినట్లు మంత్రి వెల్లడించారు.

- మంత్రి దాడిశెట్టి రాజా



శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు

ప్రతిపక్షాల సత్యాగ్రహం

- అదానీ సర్కార్ సిగ్గు, సిగ్గు అంటూ నినాదాలు
- ఉభయ సభలు మళ్లీ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లక్షల కోట్ల అదానీ కుంభకోణంపై జెపిసితో విచారణ జరిపించాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలు తమ ఆందోళనను ఉధృతం చేశాయి. ఈ అంశంపై గత నాలుగు రోజులుగా పార్లమెంటు స్తంభించినా ప్రభుత్వంలో కదలిక లేకపోవడంతో శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రతిపక్ష ఎంపీలు సత్యాగ్రహం నిర్వహించారు. "అదానీ సర్కార్ సిగ్గు సిగ్గు", "జెపిసి విచారణ జరపాలి", "ఎల్ఐసి, ఎస్‌బిఐలను కాపాడాలి" అంటూ వారు నినాదాలు చేశారు. యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్, డిఎంకె, ఆర్‌జెడి, ఎస్‌పి, ఆప్, జెడియు, బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ, శివసేన (థాకరే), ఎన్‌సిపి, జెఎంఎం, ఎన్‌సి, ఎండిఎంకె, విసికె, ఆర్ఎస్‌పి, ఆర్ఎల్‌డి, కేరళ కాంగ్రెస్ (ఎం), ఐయుఎంఎల్

మిగతా 5లో

ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బొలోరే, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం నుంచి బొలోరా వాహనం బత్తలపల్లి వస్తుంది. బత్తలపల్లిలో ఏడుగురు ప్రయాణికులను ఎక్కించుకొని ఆటో ధర్మవరం వైపు బయల్దేరింది. బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని నాగులకట్ట వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటో బొలేరో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ, ముగ్గురు పురుషులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

గాయపడిన వారిని 108 వాహనంలో బత్తలపల్లి ఆర్‌డిటి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన చిన్నారి, యువకుడు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు, క్షతగాత్రులు ఎవరన్న దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.



గిరిజనులపై తూటా!

- విద్యార్థిని హత్యపై ఆందోళన
- పోలీస్ కాల్పుల్లో మరో విద్యార్థి బలి
- మధ్యప్రదేశ్‌లో బిజెపి సర్కారు దారుణం

● లోపలి పేజీలో.. ●

పలుచోట్ల వర్షాలు

- పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- 40 గొర్రెలు, 15 ఆవులు మృత్యువాత
- దెబ్బతిన్న పంటలు.. రైతన్నకు నష్టం..

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉత్తర తమిళనాడు నుంచి కర్ణాటక మీదుగా కొంకణ్ తీరం వరకూ ఏర్పడిన ద్రోణి ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. పిడుగులు పడి ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురుకి గాయాలయ్యాయి. 40 గొర్రెలు, 15 ఆవులు మృత్యువాత పడ్డాయి. పంటలకు నష్టం వాటిల్లింది. పిందె దశలో ఉన్న మామిడి నేలమట్టమైంది.



కర్నూలు జిల్లాలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

మిరప, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం సమీపంలోని యర్రగుంట కాలనీలో పిడుగుపాటుకు నారాయణమ్మ (62), కమ్మలమ్మ (65) మృతి చెందారు. నంద్యాల జిల్లా శిరువెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన కాపరులు గొల్ల ఆంజనేయులు(45), శంకర్, నాగరాజు, విశ్వనాథ్.. కొట్టాలపల్లె-శిరువెళ్ల మధ్య గల పొలాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్లారు. గొర్రెలను మేపుతూ పొలాల్లోనే విశ్రాంతి తీసుకుంటుండగా గురువారం రాత్రి వారు ఉన్న సమీపంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. శంకర్, విశ్వనాథ్, నాగరాజుకు గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిడుగుధాటికి 40 గొర్రెలు మృతి చెందాయి. బెతంచర్ల మండలంలో 15 ఆవులు చనిపోయాయి. చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో కురిసిన వడగండ్ల వాన జిల్లా రైతాంగాన్ని అతలాకుతలం చేసింది. వెంకటేపల్లి, కొమ్మరమడుగు, కృష్ణాపురం తదితర గ్రామాల్లో కాకర, టమోటా, అరటి, చిక్కుడు, బీన్స్ పంటలు దెబ్బతిన్నాయి. బలంగా వీచిన గాలులకు మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలమనేరు జాతీయ రహదారిపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కళ్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న పంట తడిసిపోయింది. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం తాళ్లాయపాలెంలో పిడుగుపాటుకు రెండున్నర ఎకరాల్లోని వరి పంట దగ్ధమైంది. గుంటూరు మిర్చి యార్డులో కొద్ది మేర మిర్చి బస్తాలు తడిచాయి. అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కృష్ణా, ఎన్‌టిఆర్ విజయవాడ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల మామిడికాయలు నేలరాలాయి.

20న 'చలో అసెంబ్లీ'కి వామపక్షాల మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఓ నెంబరు 1 రద్దు పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు వై సాంబశివరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మూర్తి, ఎస్‌యుసిఐసి నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు సుందరరామరాజు, ఆర్ఎస్‌పి నాయకులు జానకిరాములు ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 3 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ర్యాలీలు, రోడ్‌షోలు, సభలు, సమావేశాలు జరపకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం చీకటి జిఓ 1 విడుదల చేసిందని తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్‌వారు చేసిన పోలీస్‌యాక్ట్‌లో సెక్షన్లను ఉదహరిస్తూ వైసిపి ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఉత్తర్వులివ్వడం సరికాదని పేర్కొన్నారు. కందుకూరు, గుంటూరులో జరిగిన ప్రమాద ఘటనలను సాకుగా చూపిస్తూ జిఓ తీసుకురావడం దుర్మార్గమని, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు చేయకుండా అడ్డుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న దుష్ట ఆలోచనకు తార్కాణమే జిఓ నెంబరు ఒకటని వివరించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను విఘాతమని, ప్రత్యేక పరిస్థితుల్లో సభల నిర్వహణకు అనుమతిస్తామంటున్నారు కానీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వైసిపి శ్రేణులకు మాత్రం ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేస్తున్నారని విమర్శించారు. జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపై నిర్బంధకాండను ప్రయోగిస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎపిలో జిఓ తీసుకురావడం గర్హనీయమని వివరించారు. ప్రజాస్వామిక హక్కుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చీకటి జిఓను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబరు ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిఓ నెం 1 రద్దు పోరాట ఐక్యవేదిక ఈ నెల 20న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వామపక్ష పార్టీల తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పలువురికి అసెంబ్లీ నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఇటీవల మృతి చెందిన పలువురు మాజీ శాసన సభ్యులకు స్పీకరు తమ్మినేని సీతారాం సంతాప తీర్మానాన్ని శాసన సభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. మాజీ శాసన సభ్యులు బిక్కిన గోపాలకృష్ణారావు, చుక్కా పీటర్‌పాల్, కొలుసు పెద రెడ్డయ్య, వట్టి వసంత్‌కుమార్, గుమ్మడి కుతూహలమ్మ, పాతపాటి సర్రాజుకు శాసనసభ సంతాపాన్ని వ్యక్తం చేసింది. వీరి మృతికి సంతాప సూచకంగా సభ ఒక నిమిషం మౌనం పాటించింది.

శాసన సభలో 2 బిల్లులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
శాసన సభలో ప్రభుత్వం రెండు బిల్లులను శుక్రవారం ప్రవేశపెట్టింది. 2023 ఆంధ్రప్రదేశ్ విలువ ఆధారిత పన్ను (సవరణ) బిల్లును ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సభలో ప్రవేశపెట్టగా, 2023 ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరీ, అనుబంధ బిల్లును రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రవేశపెట్టారు. ప్రాంతీయ రైల్వే ప్రయాణికుల సలహా సంఘంలో రెండేళ్ల కాలానికి (01.02.2023 నుంచి 31.01.2025) వరకు సేవలందించేందుకు ఒక శాసన సభ్యుడిని ప్రతినిధిగా ఎన్నుకునేందుకు సంబంధించిన ప్రభుత్వ ప్రతిపాదనను రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా శాసన సభలో ప్రవేశపెట్టారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.


కమాండ్ ఏరియాల్లోనూ ఉచిత బోర్లు : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ జలకళ కింద నాన్ కమాండ్ ఏరియాతో పాటు కమాండ్ ఏరియాల్లో కూడా అర్హులైన రైతులకు ప్రభుత్వం ఉచితంగా రైతులకు బోరు బావులను మంజూరు చేస్తోందని రాష్ట్ర ఇంధన, అటవీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్ఆర్ జలకళ బోరుబావులకు విద్యుత్తు కనెక్షన్లు అనే అంశంపై జరిగిన చర్చలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమాధానమిచ్చారు. వైఎస్ఆర్ జలకళ కింద ఇప్పటి వరకు 19,908 బోర్లు వేశామని, ఇందు కోసం రూ.212.26కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.21లక్షల కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చామని, మరో 4వేల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ అంశంపై జరిగిన చర్చలో టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజ నేయస్వామి రైతులు విద్యుత్తు లైన్ల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయలేరన్నారు.

ప్రజలు టిడిపి పక్షమే

- టిడిఎల్‌పిలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల మద్దతు టిడిపి పక్షానే అని తేలిందని, ప్రలోభాలకు గురిచేసినా ఓటర్లు లొంగలేదని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆ పార్టీ శాసన సభాపక్ష సమావేశం శుక్రవారం జరిగింది. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఫలితాలపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో అందరికీ శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల ఫలితాలతో అర్థమైందని తెలిపారు. హడావుడిగా ఢిల్లీ వెళ్లిన సిఎం జగన్ రాష్ట్రానికి ఏం తెచ్చారో ఈసారైనా చెబుతారా? అని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో టిడిపికి మెజార్టీ లభించడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సిబిఐ విచారణపై స్టే ఇవ్వలేం

- ఎంపి అవినాష్ రెడ్డి పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
మాజీ మంత్రి వైఎస్ వివేకానందారెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపి అవినాష్‌రెడ్డిని సిబిఐ విచారించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తనపై సిబిఐ కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై గతంలోనే వాదనలు విన్న ధర్మాసనం శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివేకా హత్య కేసు దర్యాప్తు కొనసాగించవచ్చని సిబిఐకి అనుమతించింది. విచారణను ఆడియో, వీడియో రికార్డ్ చేయాలని ఆదేశించింది. విచారణ ప్రాంతానికి న్యాయవాదిని అనుమతించాలన్న అవినాష్‌రెడ్డి అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. ఈ నేపథ్యంలో అవినాష్ రెడ్డిని, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిని సిబిఐ ఏ క్షణాన్నైనా అరెస్టు చేస్తుందనే ప్రచారం జరుగుతోంది.

గరగపర్రు కేసు కొట్టివేత

- న్యాయమే గెలిచింది: పి మధు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

కోర్టు వద్ద మాట్లాడుతున్న పి.మధు

గరగపర్రు దళితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తే పెత్తందారులు అక్రమ కేసులు పెట్టారని, అయినా దళితులకు అండగా నిలబడ్డామని, చివరకు న్యాయ పోరాటమే గెలిచిందని సిపిఎం మాజీ ఎంపి పి.మధు అన్నారు. గరగపర్రు ఉద్యమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసును పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కోర్టు శనివారం కొట్టేసింది. మధుతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, నేతలు కె.శ్రీనివాస్, జక్కంశెట్టి సత్యనారాయణ, అల్లూరి అరుణ్, పి.మంగరాజు, బివి.వర్మ, పి.సుధీర్, శ్రీరామ్, రామకృష్ణ శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. 2017లో గరగపర్రు దళితులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామంలో చెరువు గట్టుపై ఏర్పాటు చేశారన్న కారణంతో దళితులను పెత్తందారులు సాంఘిక బహిష్కరణ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు దళితులకు అండగా నిలిచి ఉద్యమించారు. దీంతో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులపై పెత్తందారులు, భూస్వాములు అక్రమ కేసులు బనాయించారు. 2017 నుంచి నేతలు కోర్టు వాయిదాలకు హాజరవుతూ వచ్చారు. దళితుల పక్షాన పోరాటం చేశారని గుర్తించిన కోర్టు అక్రమ కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గరగపర్రు దళితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో సాంఘిక బహిష్కరణ అంశాన్ని జాతీయ వ్యాప్త ఉద్యమంగా మలిచి, దళితుల పక్షాన పోరాడినట్లు తెలిపారు. ఈ పోరాటంలో సిపిఎం, ప్రజాసంఘాలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, దళిత సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయన్నారు. ఆ పోరాటం ఫలితంగా నాటి ప్రభుత్వం గరగపర్రు దళితులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. అయితే నేటికీ ఆ హామీలు పూర్తిస్థాయిలో అమలుకాలేదని తెలిపారు. మంతెన సీతారాం మాట్లాడుతూ ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా నిజమైన, న్యాయమైన సమస్య పట్ల పేదలకు అండగా ఉంటామని, వాటిపట్ల నికరంగా నిలబడతామని అన్నారు. దళితులు, సామాన్య ప్రజల సమస్యలపై తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయండి

- మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్
- వ్యవసాయ బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధరలు నిర్ణయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఇందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. వ్యవసాయ బడ్జెట్‌పై శాసన మండలిలో శుక్రవారం చర్చ జరిగింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు షేక్ షాబ్జి, వై.శ్రీనివాసులు రెడ్డి, కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వి.రావు, చర్చలో పాల్గొన్నారు. షేక్ షాబ్జి మాట్లాడుతూ ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి కొన్ని ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులు ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. వై.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జలాశయాలు, చెరువుల్లో నీరు ఉన్నా ఈఏడాది వరిసాగు తగ్గుతుందన్నారు. ఈవిషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. మామిడి రైతుల వద కాయలు కొనే సందర్భంలో వ్యాపారులు సిండికేట్ అవుతున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు ఇవ్వాలన్నారు. కె,.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ వైఎస్సార్ రైతు బీమా పథకం అమలులో చాల లోపాలు ఉన్నాయన్నారు. గుంటూరు జిల్లాలో గతేడాది తామర తెగులు వల్ల మిర్చి రైతులు నష్టపోతే బీమా పరిహారం కొంత మందికే అందిందన్నారు. కృష్ణా జిల్లాలో ఎక్కువ మందికి పరిహారం వచ్చిందన్నారు. కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందులను అరికట్టాలని కోరారు. ఎమ్మెల్సీ ఐ.వి.రావు మాట్లాడుతూ రైతులు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయాయని అన్నారు. రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సమాధానం చెబుతూ ఈక్రాప్ విధానం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ధాన్యం రైతులను ఆదుకునేందుకు మిల్లర్లు డయ్యర్లు ఏర్పాటు చేసుకునే ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. గత ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పథకాలకు రూ.9 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లడం వల్ల మూడేళ్ల పాటు ఈ పథకాలు అమలు నిలిచిపోయిందన్నారు. ఇటీవల పునరుద్ధరించామన్నారు. టమాటా రైతులను ఆదుకున్నామని, వినియోగదారులపై భారం పడకుండా చూశామన్నారు. దిగుబడి ఆధారంగా బీమా సదుపాయం వర్తింప చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ బడ్జెట్‌కు 2023-24 సంవత్సరానికి రూ.41,436 కోట్లు ప్రతిపాదించినట్టు తెలిపారు. చర్చ అనంతరం సభ శనివారం ఉదయంకు వాయిదా వేసినట్టు మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు ప్రకటించారు.

ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీపై సమాధానం లేదు

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు, జిజిహెచ్‌లు, పిహెచ్‌సిల్లో డాక్టరు పోస్టుల భర్తీపై అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తెలిపారు. మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ.. బోధనాస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యుల కొరత ఉందని, ఈ పరిస్థితుల్లో ఎంబిబిఎస్ విద్యార్థులకు పరిపూర్ణమైన విద్య ఏ విధంగా లభిస్తుందని, ఈ ఖాళీలు ఎప్పటిలోగా భర్తీ చేస్తారని అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. జీరో ఖాళీలు ప్రాతిపదికగా భర్తీ చేస్తామని మాత్రమే సంబంధిత మంత్రి సమాధానం చెప్పారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్లకు ఎంప్లాయి హెల్త్ స్కీం సక్రంగా అమలు చేయడానికి కార్యాచరణ గురించి ప్రశ్నించినా ప్రభుత్వం వద్ద సమాధానం దొరకలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఎంప్లాయి హెల్త్ స్కీంను రద్దు చేసుకుని మెడికల్ రీయింబర్స్ మెంట్ విధానానికి వెళ్లి దాన్ని పరిపుష్టం చేయాలని కోరినట్లు చెప్పారు. ఉద్యోగలకు రూ.ఐదు లక్షల గరిష్ట పరిమితి వరకు క్లయిమ్‌లు అందించాలని సూచించినట్లు తెలిపారు. గతేడాది ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లోని అన్ ఎయిడెడ్ సిబ్బందికి సంబంధించి వైఎస్ఆర్ కడప జిల్లా సింహాద్రిపురం వైఎస్ రాజారెడ్డి కళాశాల సిబ్బందికి మాత్రమే కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులు కేటాయించారని, మిగిలిన కళాశాలల్లోని వారిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్నారన్నారు. మిగిలిన కళాశాలల్లోని సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని శాసన మండలిలో కోరామన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతోనే ఆర్థిక వృద్ధి

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎవరెన్ని మాటలన్నా సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పనిమాత్రమే చేసిందని, నాలుగు అంశాలను నాలుగు స్తంభాలుగా చేసుకుని సుపరిపాలన అందించిందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసన సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా బుగ్గన మాట్లాడారు. డిబిటి విధానం అమలులో అవినీతి లేకుండా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళలను, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరినీ ప్రభుత్వం భాగస్వాములను చేసిందని చెప్పారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను కీలకంగా అనుసరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాల నిధులను అందిపుచ్చుకునేలా అనుసంధానం చేసినట్లు వివరించారు. ఈ చర్యల కారణంగానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో పంటలు పండించడానికి పెట్టుబడి 21 శాతం తగ్గిందని, పంటల ద్వారా రాబడి 23 శాతం పెరిగిందని తెలిపారు. రూ.10 వేల కోట్లు ఖర్చును భరిస్తూ వ్యవసాయానికి ఉచిత కరెంటు అందిస్తున్నట్లు చెప్పారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిందన్నారు. ప్రధాన పంటలకు ఎంఎస్ అందుతోందన్నారు. అమూల్ ఏర్పాటుతో లీటరు పాలకు రూ.5 నుంచి రూ.25 వరకు ఉత్పత్తిదారులకు అధిక ధర అందుతోందన్నారు. నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, మెడికల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ద్వారా విద్యకు ఏ రాష్ట్రంలో లేనంత వసతులు కల్పించి అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. విస్కీ, బీరు కేసులు అమ్మకాలు గత ప్రభుత్వం హయాంలోకన్నా తగ్గాయని చెప్పారు.
పోలవరం ప్రాజెక్టు నిర్మాణ జాప్యం పాపం అంతా టిడిపి ప్రభుత్వానిదే అన్నారు. ప్రాజెక్టు వ్యయంపై కేంద్రం వద్ద స్పష్టత తీసుకోకుండానే టిడిపి పనులు ప్రారంభించిందని, ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసానికి కేంద్రం నుంచి నిధులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు ఎక్కువ చేస్తుందని ప్రతిపక్ష పార్టీ చేస్తున్న విమర్శల్లోనూ నిజం లేదన్నారు. రాష్ట్రం అప్పు 12.73 శాతం మాత్రమే పెరిగిందన్నారు.

కౌల్దార్లకు సిసిఆర్‌సిలు ఇచ్చేందుకు కృషి

- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం : మంత్రి కాకాని
- మండలిలో గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తీర్మానానికి ఆమోదం
- మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా టిడిపి వాకౌట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
న్యాయపరమైన చిక్కులు రాకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సిలు ఇచ్చేలా కృషి చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసన మండలిలో శుక్రవారం చర్చ జరిగింది. సుదీర్ఘ చర్చపై మంత్రి కాకాని సమాధానం చెప్పే సందర్భంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావించడంతో టిడిపి సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. తరువాత మంత్రి మాట్లాడుతూ.. కౌలు రైతులకు అంగీకారపత్రం ఇవ్వడం వల్ల భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదనే అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. భూ యజమాని సంతకం అనే నిబంధన ఈ చట్టం నుంచి తొలగించాలని కోరారు. కౌలు రైతుల నుంచి అఫిడవిట్ తీసుకుని ఇవ్వవచ్చని మాణిక్య వరప్రసాద్ అన్నారు. ఇందుకు మంత్రి సమాధానం చెబుతూ.. ఇలా చేసినా కొంత మంది అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ అంశంపై సిఎంతో చర్చిస్తామన్నారు.
విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కేవలం సంక్షేమ పథకాలే అమలు చేస్తున్నామని, అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శ అవాస్తవం అన్నారు. పేద వర్గాలను ఆదుకునేందుకు ప్రస్తుతం సిఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు టిడిపి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేకపోయిందని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ టిడిపి కొనసాగించిందని కానీ ఏమాత్రం పెంచలేదన్నారు. ఇందుకు టిడిపి సభ్యులు నిరసన తెలిపారు. దీంతో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వావాదం జరిగింది. మంత్రి వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేస్తూ టిడిపి సభ్యులు బయటకు వెళ్లిపోయారు. తొలుత డొక్కా మాణిక్య వరప్రసాద్ ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ రాష్ట్రంలో సిఎం జగన్ ఎన్నో పరిపాలనా సంస్కరణలు అమలు చేస్తున్నారని అన్నారు. జిల్లాల పునర్విభజన, గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా గడపగడపకు ప్రభుత్వ సేవలు పెరిగాయన్నారు. సంక్షేమ పథకాల అమలు ద్వారా సామాజిక అభివృద్ధి జరుగుతుందని, దీనిని చిన్నచూపు చూడటం తగదన్నారు. అభివృద్ధి అంటే భవనాలు, రోడ్లు మాత్రమే కాదన్నారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సంక్షేమం ఉన్నా అభివృద్ధి దిశ లేదన్నారు. ఎగువ, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వం నుంచి కనీస సౌకర్యాలు ఆశిస్తారని వీరిని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. టిడిపి ఎమ్మెల్సీలు కెఇ ప్రభాకర్, అశోక్‌బాబు మాట్లాడుతూ.. వృద్ధి రేటు పెరిగితే జీతాలు ఒకటో తారీఖు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తే ఈ రెండు రంగాల నుంచి ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. విద్యా ప్రమాణలు తగ్గాయని, డ్రాపౌట్స్ పెరిగాయని అన్నారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. దిశ బిల్లులో మార్పులు చేసి మళ్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించి కేంద్రానికి పంపాలన్నారు. వైసిపి సభ్యులు వరదు కల్యాణి, తోటత్రిమూర్తులు, మెట్టు చిన గోవిందరెడ్డి, మహ్మద్ ఇక్బాల్ తదితరులు మాట్లాడారు. చర్చ అనంతరం ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించినట్టు మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రకటించారు.

వైసిపి పని అయిపోయింది

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- పాదయాత్రలో నారా లోకేష్
- శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశించిన యువగళం


మొలకలచెరువు బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి-బి మొలకలచెరువు (అన్నమయ్య జిల్లా)
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో సైకిల్ హవా మొదలైందని, వైసిపి పని అయిపోయిందని, రాబోయేది తమ ప్రభుత్వమేనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్రవారం 45వ రోజుకు చేరుకుంది. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలంలోని కమ్మపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. పులికల్లు, మొలకలచెరువు మీదుగా ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి పరిధిలోని చీకటిమానుపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. పాదయాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ఈ యాత్రలో ప్రజల బాధలు నేరుగా తెలుసుకుంటున్నాని తెలిపారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక వేరే రాష్ట్రాలకు వలస వెళు తున్నామని యువత చెప్పినప్పుడు తనకు చాలా బాధ కలిగిందన్నారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పించలేని అసమర్థ ముఖ్యమంత్రి మనకి అవసరమా? అని ప్రశ్నించారు. పన్నుల భారం, ఆకాశాన్నంటిన నిత్యావసర సరుకుల ధరలతో బతకడం కష్టంగా మారిందని, మామిడి, చెరుకు, టమోటా, వేరుశనగ రైతుల కష్టాలను కళ్లారా చూశానని తెలిపారు.
జగన్ పాదయాత్ర చేసినప్పుడు రైతు రాజ్యం, రూ.3500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, టమోటా రైతులకు కచప్ ఫ్యాక్టరీలు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామన్నారని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రూ.13,500 రైతు భరోసాతో చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వారంలో సిపిఎస్ రద్దు చేస్తానన్న హామీని జగన్ నిలబెట్టుకోలేదని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాని పట్టి పీడిస్తున్న కేన్సర్.. పెద్దిరెడ్డి కుటుంబమని, నాలుగేళ్లలో రూ.పది వేల కోట్లు దోపిడీ చేసిందని ఆరోపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు తనపై చూపించిన ప్రేమ, అభిమానాన్ని జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేనని తెలిపారు.

కదిరికి చేరిన పాదయాత్ర
నారా లోకేష్ పాదయాత్ర రాత్రికి శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరికి చేరింది. ఈ యాత్రకు కదిరి నియోజకవర్గం టిడిపి కందికుంట ప్రసాద్, పార్టీ నేత చాంద్ బాషా, జిల్లా నేతలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సవితమ్మ, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

ఓట్ల లెక్కింపులో అక్రమాలు

- ఎన్నికల సంఘానికి చంద్రబాబు ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వైసిపి అక్రమాలు, ఉల్లంఘనలకు పాల్పడిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనాకు ఫోన్ చేసి మాట్లాడటంతోపాటు లేఖ కూడా రాశారు. వైసిపి మూకలు అక్రమ పద్ధతుల ద్వారా కౌంటింగ్ ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతపురంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గం లెక్కింపులో అక్రమాలకు ప్రయత్నించారని తెలిపారు. గురువారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో వైసిపి గూండాలు ఎలాంటి పాస్‌లూ లేకుండా అక్రమంగా కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లి అలజడి సృష్టించారని వివరించారు. టిడిపి కౌంటింగ్ ఏజెంట్లపై దాడి చేసి కౌంటింగ్ స్టేషన్‌లో గందరగోళం సృష్టించారని పేర్కొన్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియను చంద్రబాబు పర్యవేక్షించారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలు, ఎన్నికల బాధ్యులకు ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనల అమలు, అక్రమాల నివారణకు చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా కలెక్టరు నాగలక్ష్మి, ఎస్‌పి ఫకీరప్పకు ఫోన్‌లో కోరారు.

శాసన మండలిలో ప్రశ్నోత్తరాలకు న్యాయం జరగడం లేదు

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
శాసన మండలిలో ప్రశ్నోత్తరాలకు న్యాయం జరగడం లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మీడియా పాయింట్లో ఆయన మాట్లాడారు. అడిగిన ప్రశ్నలకు తప్పుడు సమాచారాన్ని ఇవ్వడాన్ని ఖండించారు. శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అడిగిన 10 ప్రశ్నలకు మూడు ప్రశ్నలకు మాత్రమే ప్రభుత్వం సమాధానం ఇచ్చి ముగించిందని తెలిపారు. అధికార పార్టీ సభ్యులే ప్రశ్నలడిగి, మంత్రులు సమాధానాలతో సాగదీసి టైమ్ అయిపోయిందని ప్రశ్నోత్తరాలను ముగించారని తెలిపారు. దీనిపైన నిరసన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. సమయానికి అనుగుణంగా ప్రశ్నోత్తరాలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అడిగిన వాటికి వివరణ ఇవ్వకుండా మంత్రులు దాటవేస్తున్నారన్నారు. ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాల్లోని స్పష్టత లేదని, రికార్డుల్లో దొరక్కుండా అంతా బాగున్నట్లు తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం పూర్తయిందనే కారణంతో కోనసీమ జిల్లాలో కల్లాల్లో ధాన్యం సేకరణ నిలిపివేశారని, జిల్లా కలెక్టర్ 18 వేల టన్నులు అదనపు లక్ష్యాన్ని ప్రభుత్వాన్ని ఎందుకు కోరాల్సి వచ్చిందో తెలియజేయాలని అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. పోలీసులకు 23 నెలల టిఎల బకాయి ఉందని, ఏడాదికి మూడు సార్లు ఎర్నల్ లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ చేయాల్సి ఉంటుందని ఈ అంశాలను ప్రభుత్వం చర్చకు రానీయలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించి 2019 నుంచి మెడికల్ బిల్లుల బకాయిలు ఉన్నాయని శాసన మండలిలో ప్రస్తావించామన్నారు. ఏమీ లేవని రికార్డులు ఇస్తూ, సమాధానాల్లో మాత్రం త్వరలో క్లియర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. ప్రైవేటు ఎయిడెడ్ స్కూల్స్‌ను స్వాధీనం చేసుకుంటున్న ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖలో నడుస్తున్న ఎయిడెడ్ స్కూల్స్‌ను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించినట్లు తెలిపారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని కోరామన్నారు.

టిడిపి ఎమ్మెల్యేల సస్పెన్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లి అధోగతిపాలు చేస్తున్న రాష్ట్ర బడ్జెట్‌పై చర్చకు తమకు సమయం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు స్పీకరు పోడియం ముందుకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం కేటాయించిన సమయానికి మించి ఇవ్వడం కుదరదని స్పీకరు తమ్మినేని సీతారాం చెబుతున్నా.. టిడిపి సభ్యులు నిరసనను ఆపకపోవడంతో అచ్చెన్నాయుడు, నిమ్మకాయల చినరాజప్ప, గద్దె రామ్మోహన్‌రావు, ఏలూరి సాంబశివరావు, వెలగపూడి రామకృష్ణ, బాల వీరాంజనేయులు, ఆదిరెడ్డి భవాని, బెందాళం అశోక్, గణబాబు, రామరాజును శుక్రవారం సస్పెండ్ చేశారు. అంతకముందు శాసనసభలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడారు. ఫ్యాన్సీ నెంబర్లతో జగన్ సర్కారు రాష్ట్ర బడ్జెట్‌ను రూ.2,79,279 కోట్లుగా పెట్టిందన్నారు. ఈ బడ్జెట్ ఆచరణకు చాలా దూరంగా ఉందన్నారు. గోదావరి నుంచి శ్రీశైలంకు నీటిని తీసుకెళ్లే ప్రాజెక్టు ఏమైందన్నారు. సిపిఎస్ రద్దు, 25 మంది ఎంపిలను ఇస్తే ప్రత్యేక హోదా సాధిస్తానని, ప్రతిఏటా మెగా డిఎస్‌సి, శాసన మండలి రద్దు, ప్రతి ఎమ్మెల్యేకూ నియోజకవర్గ అభివృద్ధికి రూ.2 కోట్లు, పార్టీ ఫిరాయిస్తే వెంటనే డిస్క్వాలిఫై చేయాలన్న మాటలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. దశలవారీ మద్యపాన నిషేధం అని చెప్పి ఇప్పుడు ప్రభుత్వమే మద్యంను అమ్ముతోందని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టుకు ప్రతిఏటా కేటాయింపులకు అనుగుణంగా ఖర్చు చేయడం లేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో గ్రీజు పూయకపోవడంతో మూడు గేట్లు కొట్టుకు పోయాయని అన్నారు. ఈ ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్న హౌసింగ్ పథకానికి ఈ నాలుగేళ్లలో పెట్టిన ఖర్చు కేవలం రూ.5,890 కోట్లు మాత్రమేనని అన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనడం లేదు

- టార్గెట్ పేరుతో నిలిపేస్తున్నారు
- శాసన మండలిలో విపక్ష సభ్యులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని శాసన మండలిలో విపక్ష సభ్యులు విమర్శించారు. టార్గెట్ పేరుతో కొంతమాత్రమే కొంటున్నారని పేర్కొన్నారు. శాసన మండలి ఛైర్మన్ కె మోషేను రాజు ఆధ్వర్యాన శాసన మండలి శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రంలో ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం వివరాల గురించి పౌరసరఫరాలశాఖ మంత్రిని టిడిపి సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగారు. ఈ సందర్భంగా టిడిపి సభ్యులు చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. ఇ-క్రాప్ పేరుతో కొనుగోలు చేయడం లేదని టిడిపి సభ్యులు దీపక్ రెడ్డి అన్నారు. పిడిఎఫ్ సభ్యులు ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని తెలిపారు. రైతులంతా ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్తే ప్రభుత్వ టార్గెట్ అయిపోయిందని సమాధానం చెప్పారని పేర్కొన్నారు. ధాన్యం తీసుకోకుండా టార్గెట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. 2021-22 ఖరీఫ్‌లో 40.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, రబీలో 26.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 2022-23 ఖరీఫ్‌లో 33.47 లక్షలు సేకరించామని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమాధానం చెప్పారు.

వైద్య కళాశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలి : కెఎస్ లక్ష్మణరావు
ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ, వై శ్రీనివాసులు రెడ్డి వైద్యారోగ్యశాఖ మంత్రిని కోరారు. గుంటూరు, కాకినాడ కళాశాలలో సూపర్ స్పెషాల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అమలు కావడం లేదని చెప్పారు. రూ.1000 దాటిన చికిత్సకు కూడా ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తామని చెప్పిన ప్రభుత్వం అమలు చేయడం లేదని టిడిపి సభ్యులు చిక్కాల రామచంద్రరావు విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉద్యోగులకు ఇవ్వాల్సిన మందులను కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులివ్వండి

- పంచాయతీరాజ్ కార్యదర్శికి సర్పంచుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కేంద్ర ప్రభుత్వం మాదిరి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు శుక్రవారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌కు సచివాలయంలో వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ.. పంచాయతీలకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచే విద్యుత్ బకాయిలు చెల్లిస్తామని అంతే తప్ప సాధారణ నిధుల నుంచి విద్యుత్ బకాయిలను తీసుకోవద్దు అని కోరారు. రాష్ట్ర పంచాయతీరాజ్ అదనపు కమిషనరు మహేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర పంచాయతీ పరిషత్ ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు, సంఘం నాయకులు కొలకలూరి ధర్మరాజు పాల్గొన్నారు.

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పై దాడి

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

పెండిగ్ చలానా కట్టమన్నందుకు అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవిఐ)పై కొబ్బరి బొండాల వ్యాపారి కత్తితో దాడి చేసిన ఘటన కాకినాడ పట్టణంలో శుక్రవారం సంచలనం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ప్రకాశం వీధి చివర దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం వద్ద వ్యాన్‌పై పెంటా వెంకట దుర్గాప్రసాద్ కొబ్బరి బొండాలు విక్రయిస్తుంటారు. తనిఖీల్లో భాగంగా వ్యాపారి వద్దకు ఎంవిఐ మిద్దే చిన్నారావు వెళ్లారు. వ్యాన్‌పై చలానాలు పెండింగ్ ఉన్నాయని వాటిని తక్షణం చెల్లించాలని అడిగారు.

ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో వ్యాపారి దుర్గాప్రసాద్ చేతిలో ఉన్న కత్తితో అధికారి చిన్నారావుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. పక్కనే ఉన్న అధికారి కారు డ్రైవర్ రమణ అడ్డుకోవడంతో అతనిపైనా దుర్గాప్రసాద్ కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో చిన్నారావు తీవ్ర గాయాపాలయ్యారు. డ్రైవర్ రమణ రెండు చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న డిఎస్‌పి పి మురళీకృష్ణారెడ్డి రక్తపు మడుగులో ఉన్న చిన్నారావు, రమణను స్థానికుల సాయంతో జిజిహెచ్‌కు తరలించారు. చిన్నారావు పరిస్థితి విషమంగా ఉందని, నిందితున్ని అదుపులో తీసుకొని విచారిస్తున్నామని ఎఎస్‌పి పి శ్రీనివాస్ తెలిపారు.

వ్యవసాయ, సాగునీటిరంగాలపై బడ్జెట్‌లో చిన్న చూపు

- రైతు, కౌలు రైతు సంఘాల ఆందోళన
- 20 శాతం నిధులివ్వాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న నాయకులు వి శ్రీనివాసరావు, వి కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి తదితరులు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ, సాగునీటి రంగాలకు 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు కేవలం 13 శాతం నిధులు కేటాయించడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 61 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని చెప్పిన ఆర్థిక మంత్రి బుగ్గన... బడ్జెట్‌లో ఆ రంగానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంటే అరకొర కేటాయింపులు సరికాదన్నారు. రైతులను, కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఉల్లి రైతు పరిస్థితి దారుణంగా ఉందని, క్వింటాలు ఉల్లికి ధర రూ.300 నుండి రూ.900 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని ధాన్యం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణ, గ్రామీణ అభివృద్ధికి కోతలు పెట్టిందన్నారు. రైతు భరోసా కింద రైతులకు ఇస్తున్న రూ.13,500 ఏ మూలకూ చాలవని తెలిపారు. ఎకరాకు రూ.25 వేలు చొప్పున సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం గతేడాది నీటిపారుదలకు రూ.10 వేల కోట్లు కేటాయించి రూ.5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోవడంతో యువతకు ఉద్యోగాలు లభించడం లేదన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు ఎం సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు కాజ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణాంకాల గారడీ

- అక్కడో అంకె.. ఇక్కడో అంకె
- రాజ్యసభకు, అసెంబ్లీకి వేర్వేరు వివరాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలపై లెక్కలు కొన్ని అనుమానాలకు ఆస్కారమిస్తున్నాయి. కేంద్రానికి పంపించిన లెక్కలు, శాసనసభలో ప్రకటించిన లెక్కల మధ్య తేడాలు ఉన్నాయి. అసెంబ్లీలో వెల్లడించినవాటికి , ఢిల్లీకి పంపించిన వాటికి మధ్య 30 రోజులే తేడా అయినా, లెక్కల్లో భారీ అంతరాలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం రాజ్యసభలో రాష్ట్ర అప్పులపై సభ్యుల ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర ఆర్థికశాఖ కేంద్రానికి వివరాలు సమర్పించింది. ఇందులో రాష్ట్రం చేసిన రుణాలు ఎంత, ఏయే రంగాల నుంచి ఎంత సమీకరించారన్నది వివరించింది. ఇప్పుడు అవే రంగాల నుంచి ఎంత రుణాలు తీసుకున్నామన్నది శాసనసభలో కూడా వెల్లడించారు. ఈ రెండు అంకెల మధ్య తేడాలు ఎక్కువగానే ఉన్నాయి. బహిరంగ మార్కెట్ రుణాలుగా రూ.3,04,033 కోట్లు ఫిబ్రవరి 14వ తేదీవరకు తీసుకున్నట్లు కేంద్రానికి పంపించిన నివేదికలో పేర్కొన్నారు. అయితే శాసనసభలో ప్రకటించిన వివరాల్లో రూ.3,11,224 కోట్లు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల్లో రూ.ఏడు వేల కోట్ల వరకు తీసుకున్నట్లు పేర్కొనడం గమనార్హం. ఇక ప్రావిడెంట్ ఫండ్ నుంచి ఫిబ్రవరి వరకు రూ.51,719 కోట్లు తీసుకున్నట్లు చెప్పిన ఆర్థికశాఖ అధికారులు, శాసనసభలో మాత్రం రూ.28,695 కోట్లు మాత్రమే తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఒక్కసారిగా రూ.23 వేల కోట్లు వరకు తగ్గడం ఎలా సాధ్యం?. ఇక మొత్తం రుణాలు కూడా రూ.4,32,257 కోట్లకు చేరుకున్నట్లు కేంద్రానికి పంపిన నివేదికలో పేర్కొనగా, శాసనసభలో ప్రవేశపెట్టిన నివేదికలో మాత్రం రూ.4,26,234 కోట్లుగా పేర్కొన్నారు.

ఆర్థికశాఖ తయారుచేసిన భిన్న రుణ వివరాలు

రుణ విభాగం	అసెంబ్లీలో	రాజ్యసభకు
బహిరంగ మార్కెట్	3,11,224	3,04,033
కేంద్రం నుంచి	21,296	20,962
చిన్న మొత్తాల నుంచి	7,773	8,227
ప్రావిడెంట్ ఫండ్	28,695	51,719
మొత్తం	**4,26,234**	**4,32,257**

ఆగని మాతా, శిశు మరణాలు

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రామారావు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాతా, శిశు మరణాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు విమర్శించారు. రాజవొమ్మంగిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల్లో మూడు నెలల వ్యవధిలో 15 పైచిలుకు శిశు మరణాలు సంభవించాయని తెలిపారు. కొన్నిచోట్ల మాతృ మరణాలు కూడా చోటు చేసుకున్నాయన్నారు. గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గర్భిణులను డోలీల్లో పిహెచ్‌లకు తీసుకెళ్లే క్రమంలో కొంతమంది మరణిస్తున్నారని తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం, ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణ అందుకు భిన్నంగా ఉందన్నారు. ఏజెన్సీలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని, ఈ క్రమంలో వారు తీవ్ర రక్తహీనతకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్న పిల్లల, స్త్రీల వైద్య నిపుణులు కరువయ్యారన్నారు. మెరుగైన వైద్య పరికరాలు, పూర్తి స్థాయిలో మందులు, ఆక్సిజన్ లేక, సకాలంలో పూర్తి స్థాయిలో వైద్యం అందక శిశువులు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాడేరు, అరకు నియోజకవర్గాల్లోనూ ఇటీవల శిశు మరణాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు సమీక్షలకే పరిమితమవుతున్నారని, మాతా, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని విమర్శించారు.

విద్యారంగానికి అరకొర నిధులు

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయింపులు చేసిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఎ అశోక్ విమర్శించారు. అంకెల్లో ఎక్కువగా కనిపిస్తున్న బడ్జెట్ గతేడాదితో పోలిస్తే 0.2 శాతానికి కేటాయింపులు తగ్గాయని ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని అనేక నివేదికలు చెబుతున్నా అది 10.6 శాతం కంటే మించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం మాట గోడలకే పరిమితమని విమర్శించారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుస్తామని చెబుతూ రూ.3,500 కోట్లు మాత్రమే కేటాయించారని, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటును మరిచారని పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగానికి కూడా గతం కంటే 0.5 శాతం నిధులు తగ్గించిందని తెలిపారు. యూనివర్సిటీలకు కేటాయించిన నిధులు వాటి అభివృద్ధికి నోచుకోవని విమర్శించారు. సాంకేతిక విద్యలో ఎప్పుడు పాడిన పాటే పాడి నూతన కళాశాలలకు, ఉన్న భవనాల అభివృద్ధికీ కేటాయింపులు శూన్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, భవనాలు నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తానని చెప్పిన ప్రభుత్వం వాటి మాటే ఎత్తలేదని అన్నారు.

దళితుల సాగు భూముల్లో భూస్వాములకు పట్టాలా?

- తక్షణమే వాటిని రద్దు చేయాలి : సిపిఎం
- 20న చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా



సిపిఎం నాయకులకు సమస్య తెలియజేస్తున్న తలగాం గ్రామ దళితులు

ప్రజాశక్తి-వంగర (విజయనగరం జిల్లా)

దళితులు సాగు చేస్తున్న భూముల్లో భూస్వాములకు పట్టాలివ్వడం దారుణమని, వెంటనే ఆ పట్టాలను రద్దు చేయాలని సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా వంగర మండలం తలగాం గ్రామానికి చెందిన పలువురు దళితులు కుటుంబ పోషణ కోసం అదే గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 6లో 30.15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సన్యాసి చెరువులోగల 16.73 ఎకరాల భూమిని కొంతకాలంగా సాగు చేస్తున్నారు. పంటలు సక్రమంగా పండకపోవడంతో దళితులంతా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇదే అదునుగా భావించిన మద్దివలస, కొప్పర వలస, కొత్తవలస, ఎం సీతారాంపురం గ్రామాలకు చెందిన కొంతమంది భూస్వాములు ఆక్రమించుకొని అడ్డదారుల్లో డి- పట్టాలు పొందారు. తమ భూములను విడిచి పెట్టాలని మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో ఆవేదనకు గురయ్యారు. దీంతో ఈ విషయాన్ని సిపిఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు ఎ.జగన్మోహన్‌రావు శుక్రవారం తలగాం గ్రామంలోని ఆ భూములను పరిశీలించారు. అనంతరం వంగర తహశీల్దార్ డి.ఐజాక్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. దళితుల ఆధీనంలోని భూములను భూస్వాములు ఎందుకు సాగు చేస్తున్నారని, చెరువు గర్భంలో డి-పట్టాలు ఎలా ఇచ్చారని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కరించి తలగాం దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బడ్జెట్‌లో మహిళలకు ప్రాధాన్యత

- ఎమ్మెల్సీ పోతుల సునీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. శుక్రవారం ఆమె మీడియా పాయింట్లో మాట్లాడారు. పేదరిక నిర్మూలన కోసం చేసిన ప్రగతి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. గతంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాట నిలబెట్టుకోలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆసరా, చేయూత పథకాలను అందిస్తోందన్నారు.

జగన్ పాలనలో అసమానతలు దూరం
గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు

సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించేలా జగన్ పాలన సాగుతోందని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు అన్నారు. మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ.. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇందుకు ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు.



సిఐఐ సదరన్ చైర్‌పర్సన్‌గా కమల్ బలి

డిప్యూటీ ఛైర్మన్‌గా నందిని

హైదరాబాద్ : సిఐఐ సదరన్ రీజియన్ నూతన ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. 2023-24 ఏడాదికి గాను వొల్వో గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, ఎండి అయినా కమల్ బలిని ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఇంతక్రితం ఆయన డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్నారు. చంద్రా టెక్స్‌టైల్స్ ఎండి ఆర్ నందిని నూతన డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నందిని సిఐఐలో కీలక సభ్యురాలిగా ఉన్నారు. గ్రామీణాభివృద్ధి మరియు వరుస కూలిలపై సిఐఐ నేషనల్ కౌన్సిల్ టాస్క్ ఫోర్స్‌కు ఆమె ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. 2010-11కు గాను ఆమె సిఐఐ తమిళనాడు ఛైర్‌పర్సన్‌గా పని చేశారు.

వచ్చే దశాబ్దం భారత్‌దే : సంజీవ్ బజాజ్

వచ్చే దశాబ్ద కాలం భారత్‌దేనని సిఐఐ ప్రెసిడెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్ సిఎండి సంజీవ్ బజాజ్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సిఐఐ సదరన్ రీజియన్ నిర్వహించిన "ఇండియన్ ఇండస్ట్రీ 100" ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే 25 ఏళ్లలో భౌతిక మరియు డిజిటల్ మౌలికవసతులు, వాతావరణ మార్పులు అనేక వ్యాపారాలను ప్రభావితం చేయనున్నాయన్నారు. కొత్త ఆలోచనలు అందిపుచ్చుకోకపోతే అనేక వ్యాపారాలు మూతపడ నున్నాయన్నారు. అమెరికన్ బ్యాంక్‌ల సంక్షోభం భారత బ్యాంక్‌లపై పెద్దగా ప్రభావం చూపక పోవచ్చన్నారు.

జగన్‌కి ఆస్కార్ ఇవ్వాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - నగరి (చిత్తూరు జిల్లా)

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యంగ్యాస్త్రం సంధించారు. చిత్తూరు జిల్లా నగరి రూరల్ మండలం అయినంబాకంలో విలేకరులతో నారాయణ మాట్లాడుతూ ఇంతవరకూ జరిగిన ఎన్నికల్లో దొంగోట్లు వేయడం, బూత్‌లను ఆక్రమించడం, రిగ్గింగ్ చేయడం, ఒకరి ఓటు మరొకరు మార్చి వేయడం వంటి చేష్టలు గతంలో చూసుంటామని, కానీ నిరక్షరాస్యులకు సైతం డిగ్రీ సర్టిఫికెట్లు ఇచ్చి ఓటు హక్కు కల్పించిన ఘనత ప్రపంచంలోనే మన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని దుయ్యబట్టారు. అందువల్లే సిఎం జగన్ ప్రభుత్వానికి ఆస్కార్ పురస్కారం ఇవ్వాలన్నారు.


రాష్ట్ర ప్రభుత్వ పథకాలు భేష్

నేషనల్ డిఫెన్స్ కళాశాల ప్రతినిధి బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు చాలా బాగున్నాయని నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన సీనియర్ ఆర్మీ అధికారులు అభినందించారు. ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన సీనియర్ ఆర్మీ అధికారులు, సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఈ నెల 12 నుంచి 17 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. చివరి రోజు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు నీరబ్‌కుమార్ ప్రసాద్, కె ప్రవీణ్‌కుమార్, సునీత, ప్రద్యుమ్న, సృజన తదితరులతో సమావేశమయ్యారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో డిఫెన్స్ కాలేజీ మేజర్ జనరల్ రాజేష్ అరుణ్ మోఘే, ఎయిర్ కమాండర్ కె సుందర్‌మని, అనుప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిగ్ సి ఉగాది ఆఫర్లు



హైదరాబాద్ : గత 20 ఏళ్లుగా మొబైల్ రిటైల్ రంగంలో రాణిస్తున్న బిగ్ సి ఉగాది పండగ సందర్భంగా వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. తమ వినియోగదారులకు మొబైల్స్, స్మార్ట్ టివిలు, ల్యాప్ ట్యాప్‌ల కొనుగోలపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నామని ఆ సంస్థ సిఎండి యం బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. మొబైల్స్ కొనుగోలుపై 10 శాతం వరకు క్యాష్ బ్యాక్, వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ వాయిదాల పద్ధతిలో మొబైల్ కొనే సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రతీ మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి,స్మార్ట్ టివి కొనుగోలుపై రూ.1,500 వరకు క్యాష్ బ్యాంక్ ఇస్తున్నామన్నారు. ఆన్‌లైన్ కంటే తక్కువ ధరల్లో తమ రిటైల్ స్టోర్లలో ఉత్పత్తులు పొందవచ్చన్నారు. బ్రాండెడ్ అస్సెస్సరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్, ఐఫోన్ మొబైల్ కొనుగోలుపై రూ.5,000 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్, రూ.2వేల విలువ గల అడాప్టర్‌ను ఉచితంగా ఇస్తున్నామన్నారు. 32 అంగుళాల స్మార్ట్ హెచ్‌డి టివిని కేవలం రూ.7,999కే అందిస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ ఆఫర్లను ఉపయోగించుకోవాలని బాలు చౌదరి కోరారు.

సంపాదకీయం


స్వోత్కర్ష

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధమవుతున్న వేళ బడ్జెట్‌లో బ్రహ్మాండమైన కేటాయింపులు ఉంటాయని భావించిన ప్రజల ఆశలపై రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నీళ్లు కుమ్మరించారు. శాసనసభలో రూ.279279 కోట్లతో 2023-24 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదించిన ఆయన.. అంకెలకు ఫ్యాషన్ సొబగులు అద్దారే కానీ..ప్రాథమ్యాలను గుర్తించి తగిన కేటాయింపులు జరపడంలో విఫలమయ్యారు. బడ్జెట్ ప్రసంగం పొడువునా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ఉటంకింపులు గొప్పగా ఉన్నాయి. కాని, అందుకు తగిన ఆచరణ మాత్రం కనిపించడం లేదు. ప్రజలకు ఎన్నో మేళ్లు చేస్తున్నాం..ఇదిగో పోలవరం..అదిగో కడప ఉక్కు.. 'నాడు నేడు'తో విద్య, వైద్య రంగాల దిశ మార్చేస్తున్నాం..ఇంతకన్నా సంక్షేమమా..సవాల్ ! అంటూ పాలక పెద్దలందరూ నిత్యం వల్లించే గొప్పలన్నీ..ఊసుపోక కబుర్లేనని బుగ్గన పద్దుతో తేలిపోయింది.

వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రహదారులు, మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాలన్నిటికీ అత్తెసరు కేటాయింపులతోనే సరిపెట్టడం 'సంక్షేమ పాలకులు'గా స్వీయ భుజకీర్తులు తగిలించుకున్నవారికి తగని పని. ఏ బడ్జెట్‌లో అయినా సరే మూలధన వ్యయం మొత్తం పద్దులో 25 శాతం ఉంటే దానిని మంచి ఆర్థిక ప్రణాళికగా పరిగణిస్తారు. కానీ బుగ్గన పద్దులో మూలధన వ్యయానికి ఈ ఏడాది రూ.31061 కోట్లతో సరిపెట్టారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 11.12 శాతమే. 2022-23 బడ్జెట్‌లో మూలధన వ్యయంగా రూ.30679 కోట్లు ప్రతిపాదించి..ఈ ఏడాది జనవరి వరకు పది నెలల్లో రూ.7367 కోట్లే ఖర్చు చేశారు. ఇక ఈ ఏడాది ప్రతిపాదించిన మూలధన వ్యయంలో ఎంత ఖర్చు చేస్తారనేది సందేహమే. ఈ అరకొర కేటాయింపులు, కుదింపు ఖర్చులతో పోలవరం పునరావాసం, వెలిగొండ, హంద్రీనీవా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయ్యేదెన్నడు? రాజధాని అమరావతి నిర్మాణ పనులకు ఉన్నత న్యాయస్థానమే లక్ష్యాలు నిర్దేశించినా..బడ్జెట్‌లో ఆ ఊసే లేకపోవడం గమనార్హం. పోనీ పాలకపక్షం మూడు రాజధానులుగా చెబుతున్న నగరాలకేమైనా విదిలించారా? అంటే అదీ లేదు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ గురించి ప్రస్తావన లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ రద్దు చేస్తామన్న హామీ నాలుగేళ్లుగా వెక్కిరిస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయులతో సహా శ్రమజీవులందరినీ ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నది వాస్తవం. మసిబూసి మారేడు కాయ అని ప్రజలను మోసం చేసే ప్రయత్నాలే మినహా రాష్ట్రాభివృద్ధికి దోహదకారి అయ్యే పద్దులేవీ ఈ దఫా బడ్జెట్‌లో కానరాలేదు. నగదు బదిలీ పథకాలు మినహాయిస్తే రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలకు ఒరిగిందేమిటంటూ అధికారపక్షంలోనూ అసంతృప్తి స్వరం వినిపిస్తుండటం గమనార్హం.

గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒకవైపు కుట్రలు సాగిస్తుంటే..రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని అనుసరించడం ఆందోళనకరం. 'ఉపాధి'కి రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద కనీసం రూ.500 కోట్లు అయినా కేటాయించాల్సి వుండగా ఆ ప్రస్తావనే చేయకపోవడం పేదలపై కక్ష పూనడమే. ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో అప్పులు చేయడం తప్పుకాకపోవచ్చు. కానీ అప్పుగా తెచ్చిన సొమ్మంతా కొన్ని పథకాలకు తగలేసి.. ప్రాధాన్యతా రంగాలను విస్మరిస్తే రాష్ట్రాభివృద్ధి ప్రమాదంలో పడుతుంది. ఇప్పటికే రాష్ట్రం చేసిన అప్పులకు ప్రతి యేటా వడ్డీల కింద రూ.28 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది. నాలుగు సంవత్సరాల్లో ఏడాదికి రూ.45 వేల కోట్లు అప్పులు చేస్తే ఈ సంవత్సరం రూ.56 వేల కోట్లకు పెరిగింది. 'కుల పోరాటం కాదు..వర్గ పోరాటం' చేస్తున్నామంటూ ఒకవైపు అభ్యుదయ పలుకులు పలుకుతూ మరోవైపు నిధుల నిరాకరణ ద్వారా శ్రామికవర్గాన్ని అణిచేసే ఎత్తులు వేయడం పాలకపక్షానికే చెల్లింది. వినాశకరమైన ఈ విధానాలను వ్యతిరేకించకుండా అణిచేసేందుకే జీవో నంబరు 1 వంటి నిరంకుశ ఆయుధాలతో పాలకులు పన్నాగాలు పన్నుతుంటారు. విశాల ఐక్య పోరాటాలతోనే ప్రజా వ్యతిరేక విధానాలను, నిరంకుశ పన్నాగాలను అడ్డుకోగలం.

మనసులోని మాట



నువ్వు ఆనందదాయకమైన జీవితం గడపాలనుకుంటే దాన్ని వ్యక్తులతోనో లేక వస్తువులతోనో గాక ఒక లక్ష్యంతో ముడిపెట్టుకో.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.



మరింత ఉధృతంగా కార్మిక కర్షక పోరాటాలు

విశ్లేషణ





డా॥ విజూకృష్ణన్

పెట్టుబడిదారీ వ్యవస్థలో రోజురోజుకు తీవ్రమౌతున్న సంక్షోభాలు, గతంలో ఎన్నడూ లేని విధంగా కరోనా మహమ్మారి విస్తరణ, ప్రపంచం గత ఎనిమిది దశాబ్దాలలో ఎరుగని వరుస రెండవ మాంద్యం...వంటి అంశాలు నయా ఉదారవాద నమూనా యొక్క డొల్లతనాన్ని, అనాగరికతను బహిర్గతం చేశాయి. పెరుగుతున్న అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, మెజారిటీ ప్రజలు ఎదుర్కొంటున్న వ్యాధుల పట్ల పాలక పక్షాలు తీవ్రమైన ఉదాసీనతతో కూడిన వైఖరిని అవలంభించాయి. ఇదే సమయంలో, మహమ్మారి వలన ఏర్పడిన అత్యంత వినాశకర పరిస్థితిలో కూడా అతి కొద్దిమందిగా ఉన్న కార్పొరేట్ కుబేరులకు గరిష్టంగా లాభాలు సమకూర్చే పనిలో నిమగ్నమైంది. మహమ్మారి వ్యాపించిన గత రెండు సంవత్సరాల కాలంలో ప్రపంచ జనాభాలో 99 శాతం ప్రజలందరి రెండు రెట్ల సంపదను ప్రపంచంలోని 1 శాతం ధనవంతులు పోగు చేసుకున్నారు. భారత దేశంలోని ప్రజలు అప్పులతో, పేదరికం, నిరుద్యోగం, ఆకలితో కొట్టుమిట్టాడుతున్న సమయంలో, బిజెపి ప్రభుత్వానికి అనుకూలమైన ఆప్తమిత్రులు సంపదను కూడబెట్టుకోవడాన్ని చూస్తున్నాం. భారత దేశంలోని 40 శాతానికి పైగా సంపద జనాభాలో 1 శాతం వద్ద ఉన్నది. భారత దేశంలోని బిలియనీర్ల సంఖ్య 2021లో 102 నుండి 166కు పెరిగింది. దీనికి భిన్నంగా, ప్రపంచంలోనే అత్యధికంగా, 23 కోట్ల మంది భారత ప్రజలు పేదరికంలో నివసిస్తున్నారు. అత్యంత దారుణమైన తిరోగమనంతో కూడిన అనాగరిక చర్య ఏమంటే లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులు తాము వున్న ప్రదేశం నుండి ఒకేసారి సామూహిక వలసలు చేపట్టవలసిరావడం, ఆక్సిజన్‌తో పాటు, కనీస ఆరోగ్య వసతుల కొరత వల్ల గంగానదిలో శవాలు తేలడం. అదే సమయంలో కార్పొరేట్, మతతత్వ పాలకులు 'పి.ఎం కేర్స్' పేరుతో కోట్ల రూపాయలను పోగు చేసుకున్నారు. ఇదే సందర్భంలో వారి ఆశ్రితులు సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను ఇతర వనరులను స్వాధీనం చేసుకొని, సంపదలను కూడబెట్టుకున్నారు. గత ఎనిమిదేళ్ల మోడీ బిజెపి పాలనను గమనించినట్లయితే, గతంలో ఎన్నడూ ఎరుగని విధంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, నిరుద్యోగ యువతతో పాటు భారీ సంఖ్యలో నాలుగు లక్షల పైగా ప్రజలు నిస్పృహతో ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రమై ప్రజలు, రైతాంగం పేదరికంలోకి నెట్టివేయబడటమే కాక, తమ ఉపాధికి అవసరమైన కనీస వనరులను కోల్పోయారు. ఈ దుర్భర పరిస్థితి నుండి దృష్టి మళ్లించేందుకు మతపరమైన విభజనలను సృష్టిస్తున్నారు. అల్ప సంఖ్యాక వర్గాలపై, బలహీన వర్గాలపై దాడులు చేస్తున్నారు. నయా ఉదారవాద విధానాలను నిరోధించేందుకు ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించాయి. భారతదేశంలో కూడా సామూహిక ప్రజా పోరాటాలను నిర్వహించి చారిత్రికమైన విజయాలను సాధించాయి. తద్వారా నిరంకుశ ప్రభుత్వం తన విధానాలను, అనివార్యంగా వెనక్కి తీసుకునేట్లు చేయగలిగాయి.

ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) స్వతంత్రంగా పోరాటాలు నిర్వహించి, నూతన ప్రాంతాలకు విస్తరించింది. ఎఐకెఎస్ నవంబర్ 2016లో స్వతంత్రంగా నిర్వహించిన కిసాన్ సంఘర్ష్ జాతా, కిసాన్ సంఘర్ష్ ర్యాలీ, నరేంద్ర మోడీ వినాశకర నోట్ల రద్దుకు వ్యతిరేకంగా నిర్వహించబడిన మొట్టమొదటి అఖిల భారత నిరసన కార్యక్రమం. రాజస్థాన్ రైతాంగం నిర్వహించిన పోరాటాలు, నాసిక్ నుండి ముంబాయి వరకు రైతులు నిర్వహించిన కిసాన్ లాంగ్ మార్చ్ బిజెపి ప్రభుత్వాలను ఓడించి, అనివార్యంగా డిమాండ్లను అంగీకరించేట్లు చేసింది. ఆవిధంగా బిజెపి ప్రభుత్వ మెడ వంచవచ్చన్న స్పష్టమైన సందేశాన్నిచ్చింది. ఈ పోరాటాలు ప్రజల అవగాహనా శక్తిని పెంచడమే కాక, వారిలో విశ్వాసాన్ని పెంపొందించాయి. ఆల్‌ఇండియా కిసాన్ సభ, సమస్యల ప్రాతిపదికన ఐక్యతను, ఐక్య పోరాటాలను నిర్మించడంలో చొరవ చూపింది. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వ అనాగరిక భూమి సేకరణ ఆర్డినెన్సును వెనక్కు తీసుకోవడంలో భూమి అధికార్ ఆందోళన్ అవిశ్రాంత పోరాటాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఐక్య పోరాటం ద్వారా

> **ఏప్రిల్ 5న జరగబోయే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ...సి2 + 50 శాతం కనీస మద్దతు ధరకు హామీ, నెలకు కనీస వేతనం రూ. 26,000, గ్రామీణ ఉపాధి చట్టం కింద రోజుకు రూ.600 తగ్గకుండా 200 పని దినాలు, ఆహార భద్రత, విద్యుత్ చట్ట సవరణల ఉపసంహరణ, సామాజిక భద్రత, పెన్షన్ల లాంటి అంశాలతోపాటు రైతులు, కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతుంది. రాష్ట్రాల ఫెడరల్ హక్కులు, ప్రజల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం, హిందూత్వ ఫ్యాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది.**

నిరంకుశ, కార్పోరేట్, మతతత్వ ప్రభుత్వానికి మొట్టమొదటి అపజయాన్ని అందించాయి. ఆల్ ఇండియా కిసాన్ కోఆర్డినేషన్ సంఘర్ష్ సమితి, సమస్యల ప్రాతిపదికన ఆల్ ఇండియా కిసాన్ సభతో పాటు, 250 రైతు సంస్థలు... గిట్టుబాటు ధరల కోసం, అప్పుల బారి నుండి విముక్తి కోసం, భారీ ఎత్తున సమీకరణలు నిర్మించడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. కేంద్ర కార్మిక సంఘాలు సైతం ఐక్య పోరాటాలను నిర్వహించడం ఈ విషయంలో చెప్పుకోదగిన అంశం. ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు నిర్వహించాయి.

కార్పోరేట్ అనుకూల, మతతత్వ, నయా ఉదారవాద విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాన్ని పోరాటాలతో కట్టడి చేయడానికి కార్మిక వర్గం, రైతాంగం చైతన్యవంతమైన ఐక్య ఉద్యమాలను నిర్మించాయి. ఆల్ ఇండియా కిసాన్ సభ, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘాల ఒక దశాబ్ద కాలపు నిరంతర కృషి, ఐక్యత ద్వారా ఇది సాధ్యమైంది.

2018లో కార్పొరేట్ మీడియా ఎర్రజెండా మీద కారు కూతలు కూస్తున్న, రాస్తున్న సమయంలో ఎఐకెఎస్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో అత్యంత సమరశీల పోరాటాలు జరిగాయి. ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా ఉధృత ప్రచారంతో పాటు స్వచ్ఛందంగా కోర్టు అరెస్టులకు సిద్ధపడటం, జైల్ భరో కార్యక్రమాలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా ఐదు లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. సెప్టెంబర్ 5న, కార్మిక, కర్షక ఐక్యతను బలపరుస్తూ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ప్రదర్శన జరిగింది. ఈ నిరంతర పోరాటాలు మోడీ నాయకత్వంలోని నిరంకుశ, కార్పొరేట్, మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టించాయి. కరోనా మహమ్మారి వ్యాపించి ప్రపంచమంతా వ్యాధితో పోరాడుతున్న లాక్‌డౌన్ కాలంలో అన్నిచోట్ల భయంతో కూడిన వాతావరణం నెలకొంది. లాక్‌డౌన్ విధించిన నెల రోజుల లోపే ఈ మూడు సంఘాల చొరవతో ఆర్థిక సహకారం కోసం, ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి చట్టం ప్రకారం ఉపాధి, నిరుద్యోగ వేతనాలు, సార్వత్రిక వైద్య, ఆరోగ్య సౌకర్యాలు, సామాజిక భద్రతల కోసం డిమాండ్ చేస్తూ కార్మిక వర్గం ముందుకు వచ్చింది.

అయితే, బిజెపి ప్రభుత్వం రైతాంగంపై, కార్మిక వర్గంపై దాడులు చేస్తూ తన కార్పోరేట్ మిత్రులకు మాత్రం భారీ ఎత్తున రాయితీలు ఇచ్చింది. భారత వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ రంగానికి అప్పగించే లక్ష్యంతో మూడు కార్పోరేట్ అనుకూలమైన రైతు చట్టాలను రూపొందించింది. అంతేగాక కార్మికవర్గం కష్టపడి సాధించుకున్న హక్కులను గుంజుకొనే లేబర్ కోడ్లు, అంతులేని లాభాలను పెంచే లక్ష్యంతో, హద్దులు లేని దోపిడీ విధానాలను అప్రజాస్వామిక పద్ధతుల్లో తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఇది మన రాజ్యాంగ పరమైన, సమాఖ్య విధానాన్నే దెబ్బతీసింది. ఈ చర్యలను కార్మికులు, రైతాంగం తమ శక్తివంచన లేకుండా ప్రతిఘటించాయి. 2020 నవంబర్ 26న కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వగా, రైతు సమస్యల ఆధారిత ఐక్యతా సంస్థ, సంయుక్త కిసాన్ మోర్చాలు గ్రామీణ భారత హర్తాళ్‌కు పిలుపునిచ్చాయి. దేశ రాజధానికి పొరుగున ఉన్న రాష్ట్రాలు చలో ఢిల్లీకి పిలుపునిచ్చాయి. 380 రోజులు పాటు సాగిన ఈ ఉద్యమం వ్యవసాయ కార్మిక సంఘం, కార్మిక వర్గం యొక్క చురుకైన భాగస్వామ్యంతో సాగింది. 750 మంది రైతుల బలిదానంతో, బిజెపి ప్రభుత్వం రైతాంగానికి క్షమాపణలు చెప్పి చట్టాలను వెనక్కు తీసుకునేలా చేసింది. ఈ ప్రతిఘటన నేపథ్యంలో లేబర్ కోడ్లను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ విజయం సాధించడానికి సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణల మధ్య సమన్వయమే ప్రధాన కారణం. విద్యుత్ సవరణల ఉపసంహరణ కూడా ఎస్‌కెయం, కార్మిక వర్గాల పోరాటాల డిమాండ్ ఫలితమేనని గమనించాలి. విశాఖపట్నంలోని ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి రైతాంగ మద్దతు చెప్పుకోదగినది. మహారాష్ట్ర లోని విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటు పరం చేయటానికి, అదానీలకు అప్పగించడానికి చేసిన ప్రయత్నాలను విద్యుత్ రంగ కార్మిక వర్గం ఓడించింది.

కార్మికులు, కర్షకులు కష్టపడి సాధించుకున్న హక్కుల పరిరక్షణను వక్కాణిస్తూ 2023 ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ నిర్వహించాలన్న నిర్ణయం జరిగింది. నిరంకుశ కార్పొరేట్, మతోన్మాద, బిజెపి ప్రభుత్వ వ్యతిరేక పోరాటమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. 2023వ సంవత్సరం కీలకమైంది కావడంతో వర్గ సమస్యలను దేశ ఎజెండాలో ఉంచేందుకు, ప్రజానుకూల ప్రత్యామ్నాయ వాతావరణం నెలకొల్పేందుకు అవసరమయ్యే నిరంతర నిరసనల ప్రారంభానికి ఈ ర్యాలీ ఒక సూచిక. కార్మిక, కర్షక పోరాటాల్లో ఇదొక అతి పెద్ద పోరాటంగా గుర్తించబడాలంటే లక్షల సంఖ్యలో ప్రజాసమీకరణ జరగాలి. దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఈ పోరాట సందేశం చేరవేయాలి. ఇంటింటి ప్రచారం ద్వారా కార్మికులు, కర్షకులు, కష్టజీవులను చేరుకోవాలి. శ్రేయోభిలాషులను సమీకరించేందుకు ఉధృతంగా ఉమ్మడి ప్రచారం జరగాలి.

ఏప్రిల్ 5న జరగబోయే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ...సి2 + 50 శాతం కనీస మద్దతు ధరకు హామీ, నెలకు కనీస వేతనం రూ. 26,000, గ్రామీణ ఉపాధి చట్టం కింద రోజుకు రూ.600 తగ్గకుండా 200 పని దినాలు, ఆహార భద్రత, విద్యుత్ చట్ట సవరణల ఉపసంహరణ, సామాజిక భద్రత, పెన్షన్ల వంటి అంశాలతోపాటు రైతులు, కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతుంది. రాష్ట్రాల ఫెడరల్ హక్కులు, ప్రజల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం, హిందూత్వ ఫ్యాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. ఈ ర్యాలీ...నయా ఉదారవాద, కార్పొరేట్-మతోన్మాద పాలనకు ఒక రాజకీయ సైద్ధాంతిక సవాల్. ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల్ని ముందుకు తీసుకుపోయే ఒక ఐక్య కార్యాచరణ. అంతేగాక, ప్రజా శత్రువులకు నిర్ణయాత్మక ఓటమిని అందించేందుకు, ప్రజానుకూల ప్రత్యామ్నాయ విశాల ఐక్యతా నిర్మాణానికి ఈ ర్యాలీ పనిచేస్తుంది.

(వ్యాసకర్త ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి)

పారిస్ కమ్యూన్ : ఒక గమనం! ఒక గమ్యం!

సందర్భం



ఆర్. రఘు

పారిస్ కమ్యూనా..! ఏంటది..? కథా...? సినిమానా..? నవలా..? ఏదీ కాదు. 1871 మార్చి 18న పారిస్ కార్మికవర్గం మానవజాతి చరిత్ర పుస్తకంలో రాసిన ఒక అజరామర ఉదంతం. పెట్టుబడిదారీ వ్యవస్థ 17, 18 శతాబ్దాలలో ఐరోపా ఖండం, అమెరికాలలో వేళ్లూనికుని ప్రపంచాన్ని ఆవహించడానికి ఉర్రూతలూగుతున్న రోజులవి. ఫ్రాన్స్ దేశంలో 1789లో సాగిన పెట్టుబడిదారీ విప్లవం (పారిశ్రామిక విప్లవం) ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసింది. కారణం తరతరాల పురాతన సమాజాలను ముఖ్యంగా నాటి రాచరిక పాలనను ఆ దేశ పెట్టుబడిదారీ వర్గం అత్యంత హింసాత్మకంగా కూలదోసి ఆధునిక రాజ్య స్థాపన చేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు మిన్నుముట్టాయి. అయితే కొద్ది దశాబ్దాలలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ క్రూరత్వం ప్రపంచానికి తెలియవచ్చింది. ఐరోపా ఖండంలోనే ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఈ వ్యవస్థే సృష్టించిన కార్మికవర్గం తిరుగుబాట్లు ప్రారంభించింది. కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌ల నాయకత్వాన కమ్యూనిస్టు లీగ్ (1847) ఏర్పడింది. మొదటి అంతర్జాతీయ కార్మిక సంస్థ 1864లో ఏర్పడింది. మార్క్స్, ఏంగెల్స్‌లు 1848లో 'కమ్యూనిస్టు ప్రణాళిక' విడుదల చేశారు. ఈ క్రమంలో అదే ఫ్రాన్స్ దేశంలో కార్మికవర్గం 1871లో స్వతంత్రంగా పారిస్ నగరంలో అధికారంలోకి వచ్చి 72 రోజులు పరిపాలన సాగించింది. దీనినే "పారిస్ కమ్యూన్" అంటారు. కార్మికవర్గం ఏ పరిస్థితులలో అధికారంలోకి వచ్చింది, అధికారంలోకి వచ్చిన వెనువెంటనే నిమిషం కూడా ఆలస్యం చేయకుండా, క్షణం తీరిక లేకుండా కార్మికవర్గ ప్రభుత్వాన్ని ఎలా నడిపింది, కేవలం 72 రోజులలో ఏమేమి చేయగల్గింది, చివరకు ఎలా కూల్చబడింది... అన్నది నేటి తరానికి ముఖ్యంగా విప్లవ కార్మిక సంస్థలలో పనిచేస్తున్న యువతకు తెలియాలి.

నేడు ప్రపంచ గమనం ఎటుంది?

ఆధునిక రచయితలందరూ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక సాంఘిక వ్యవస్థగా అది పుట్టిన తరువాత ఎన్నడూ లేనంత బలహీనమైన స్థితికి చేరుకుంది అని రాస్తున్నారు. ఆర్థిక మాంద్యం, మానవ చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రమైన ఆర్థిక అసమానతలు, వీటికి తోడు నిరుద్యోగం, ఉపాధి లేమి, పేదరికం, ఆకలి, అనారోగ్యం, పర్యావరణ వినాశనం... నేటి పెట్టుబడిదారీ ప్రపంచం ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి.

"మానవాళి తనకంటూ ఓ మంచి భవిష్యత్తు కావాలనుకుంటే ప్రస్తుత వ్యవస్థని కొనసాగనివ్వకూడదు. ఒక వేళ దీనిపైనే మూడవ సహస్రాబ్దిని నిర్మించాలనుకుంటే విఫలం అవుతాము. చివరకు మిగిలేది ఓ చీకటి సమాజమే" అని ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ తేల్చి చెప్పాడు. కారల్ మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పినట్లు నేడు మునుపెన్నటికన్నా ప్రపంచం ఎక్కడికి చేరుకుందంటే సమాజాన్ని విప్లవాత్మకంగా పునర్ నిర్మించడమా? లేక పోటీపడుతున్న వర్గాలన్నీ సమిష్టిగా నాశనం అవటమా? అన్న దశకు చేరుకున్నాయి అనిపిస్తుంది.



> **ఫ్రాన్స్ జాతి ఉన్మాదానికి చిహ్నాలుగా ఉన్న రాచరిక ఆనవాళ్లను తొలగించి వేసింది. ప్రజలపై ఉన్న అక్రమ వడ్డీలను రద్దు చేసింది. మూసివేయబడ్డ కార్ఖానాలను కార్మికుల సహకార సంస్థలకు అప్పగించింది. కార్ఖానాలలో రాత్రి పనులు నిషేధించింది. కార్మికులపై అపరాధ రుసుం వేసే పద్ధతిని రద్దు చేసింది. విప్లవాత్మకమైన మరో నిర్ణయం ఏమంటే మతాన్ని, రాజ్యాన్ని విడగొట్టడం. లౌకిక విద్యను మాత్రమే బోధించాలని, మత విషయాలు పాఠ్యాంశాలలో ఉండరాదని చట్టం చేయడం. నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందించింది. ఆ విధంగా కమ్యూన్ ఏవో కొన్ని సంకుచిత జాతీయ లక్ష్యాల కోసం కాకుండా మొత్తం అణగారిన శ్రామిక జనబాహుళ్యం కోసం నిలబడింది. పోరాడింది. పోరాడుతూనే నేలకొరిగింది. విఫలమైనప్పటికీ ఇటువంటి మహత్తర పోరాటాలను కార్మిక వర్గం చేస్తూనే ఉండాలి.**

పారిస్ కమ్యూన్ పిలుపు

తాను చెప్పిన ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అందరికీ సుఖవంతమైన జీవితం, ఆధునిక ప్రగతిశీల భావాలు, శాస్త్రీయ దృక్పథంపై ఆధారపడ్డ సమాజాన్ని నిర్మిస్తాం అని నమ్మబలికిన పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టిన 100 ఏళ్లలోనే అవన్నీ దానికి సాధ్యం కాదని, ఆ పని విప్లవ కార్మికవర్గం మాత్రమే చేయగలదని 1871 లోనే పారిస్ కమ్యూన్ చేసి చూపించింది. మానవ చరిత్రలో మొట్టమొదటసారి కార్మిక వర్గం మాత్రమే ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటాన్ని సమసమాజం కోసం జరిగే పోరాటంగా మలచగలదని నిరూపించింది. 1871 మార్చి 18న ప్యారిస్ నగర కార్మికులు ఆ నగరం నుండి పెట్టుబడిదారులను తరిమేసి అధికారం చేపట్టారు. పది రోజుల తర్వాత మార్చి 28న ప్యారిస్ కమ్యూన్, కార్మిక ప్రభుత్వాన్ని, తొలి కార్మిక రాజ్యాన్ని స్థాపించారు. ఈ విప్లవం పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించింది. కారణం అవి క్రూరమైన మూఢ, మత విశ్వాసాలకు రూపాలుగా ఉన్న భూస్వామ్య రాచరిక పాలనను అంతం చేసిన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతా విస్తరిస్తున్న రోజులు. ప్రజాస్వామ్యం, గణతంత్రం, లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రీయ దృక్పథాల ఆధారంగా తన పరిపాలన ఉంటుందని పెట్టుబడిదారీ పాలకులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్న రోజులు. అయితే అప్పటికే మార్క్స్, ఏంగెల్స్‌ల నాయకత్వాన ప్రారంభమైన మొదటి ఇంటర్నేషనల్ పెట్టుబడిదారీ దేశాల (జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లాండ్, బెల్జియం తదితర) అన్నింటా కార్మిక వర్గాన్ని పోరాటాలవైపు కూడగడుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బండారాన్ని బైటపెట్టి, దాన్ని కూల్చగలిగిన ఏకైక శక్తి కార్మిక వర్గమని, అది నిర్వహించాల్సిన చారిత్రక పాత్ర గురించి మార్క్స్, ఏంగెల్స్‌లు సిద్ధాంతం రూపొందించారు. కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం-మార్క్సిజం కార్మిక వర్గంలో ప్రభావం కలుగ జేస్తున్నది. ఈ నేపథ్యంలో అనివార్యంగా వచ్చిన అవకాశాన్ని పారిస్ కార్మిక వర్గం అందిపుచ్చుకున్నది. జర్మనీతో సాగిన యుద్ధంలో ఫ్రాన్స్ ప్రభువు నెపోలియన్ 1870లో చేతులెత్తేశాడు. ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని స్థాపిస్తామని ప్రగల్భాలు పలికిన ఫ్రెంచి పెట్టుబడిదారులు చతికిలబడిపోయారు. జర్మన్ సైన్యాలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరాన్ని (ఇందులో 20 జిల్లాలు ఉంటాయి) చుట్టుముట్టాయి. ఈ పరిస్థితులలో పారిస్ కార్మికులు ఎదురు తిరిగారు. పెట్టుబడిదారులను తరిమేశారు. పారిస్ నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. వెనువెంటనే తమది సోషల్ గణతంత్ర రాజ్యంగా ఉంటుందని ప్రకటించారు. దిమ్మ తిరిగిపోయిన ఫ్రెంచి పెట్టుబడిదారీవర్గం జర్మన్ ప్రభుత్వంతో, ఆ దేశ దోపిడీదారులతో నిస్సిగ్గుగా ఒప్పందం చేసుకొని వారి సైన్యం సహకారంతో పారిస్ నగరంపై తీవ్రమైన దాడి చేసి 72 రోజుల కార్మిక వర్గ రాజ్యాన్ని పారిస్ కమ్యూన్‌ని రక్తపుటేరుల్లో ముంచెత్తింది. సుమారు 40,000 మంది కమ్యూనార్డ్స్‌ని కాల్చిచంపారు. కొన్ని వేలమంది విదేశాలకు వెళ్లిపోవాల్సి వచ్చింది. జైళ్లు కమ్యూన్ కార్యకర్తలతో నిండిపోయాయి. పెట్టుబడిదారీ దేశాల పాలకులందరికీ మొదటి ఇంటర్నేషనల్‌ని నాశనం చేయాలని, అందుకు వారి దేశాల్లో ఉన్న ఇంటర్నేషనల్ నాయకుల్ని వేటాడి అంతం చేయమని పిలుపులు వెలువడ్డాయి. బూర్జువా పత్రికలు కమ్యూన్‌పై విషం చిమ్మే రాతలు రాశాయి.

ప్యారిస్ కమ్యూన్ పాలన

మార్చి 18 విప్లవం జయప్రదం కాగానే కార్మిక వర్గం నగరంలో ఎన్నికలు నిర్వహించింది. ప్రజా ప్రతినిధులు కార్మికులకు అందుతున్న (నాటికి ఆరు వేల ఫ్రాంకులు) కనీస వేతనం మాత్రమే తీసుకోవాలని షరతు విధించింది. కమ్యూన్ ఏర్పడగానే మొదటి చట్టం నిరంకుశ పోలీస్, సైన్యం వ్యవస్థలను రద్దు చేసింది. వాటి స్థానంలో శక్తివంతులైన ప్రజలే సైన్యం అని ప్రకటించింది. న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నత అధికారులు ఎవరైనా ప్రజలతో ఎన్నుకోబడాల్సిందే. నచ్చకపోతే వారిని దిగిపొమ్మని, తిరిగి వేరే వారిని ఎన్నుకునే హక్కును ప్రజలకు ఇస్తూ చట్టం చేయబడింది. ఫ్రాన్స్ జాతి ఉన్మాదానికి చిహ్నాలుగా ఉన్న రాచరిక ఆనవాళ్లను తొలగించి వేసింది. ప్రజలపై ఉన్న అక్రమ వడ్డీలను రద్దు చేసింది. మూసివేయబడ్డ కార్ఖానాలను కార్మికుల సహకార సంస్థలకు అప్పగించింది. కార్ఖానాలలో రాత్రి పనులు నిషేధించింది. కార్మికులపై అపరాధ రుసుం వేసే పద్ధతిని రద్దు చేసింది. విప్లవాత్మకమైన మరో నిర్ణయం ఏమంటే మతాన్ని, రాజ్యాన్ని విడగొట్టడం. లౌకిక విద్యను మాత్రమే బోధించాలని, మత విషయాలు పాఠ్యాంశాలలో ఉండరాదని చట్టం చేయడం. నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందించింది. ఆ విధంగా కమ్యూన్ ఏవో కొన్ని సంకుచిత జాతీయ లక్ష్యాల కోసం కాకుండా మొత్తం అణగారిన శ్రామిక జనబాహుళ్యం కోసం నిలబడింది. పోరాడింది. పోరాడుతూనే నేలకొరిగింది. విఫలమైనప్పటికీ ఇటువంటి మహత్తర పోరాటాలను కార్మిక వర్గం చేస్తూనే ఉండాలి. "కొన్ని నిరాశా సందర్భాలలో కూడా అవకాశం ఉండదని తెలిసినప్పటికీ జరిగే పోరాటాలు ప్రజానీకాన్ని భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేయడానికి పాఠశాలలుగా ఉపయోగపడతాయని" అన్నాడు లెనిన్. కారల్ మార్క్స్ చెప్పినట్లు..."ప్యారిస్ కమ్యూన్ లక్ష్యాలు కార్మిక వర్గం విముక్తి చెందేవరకు చరిత్రలో మరలా మరలా ముందుకు వస్తూనే ఉంటాయి" అని గుర్తుంచుకోవాలి. నిజం. ఇప్పుడు మరలా ప్యారిస్ కమ్యూన్‌ని ముందుకు తెద్దాం. సాధించుకుందాం సోషలిస్టు వ్యవస్థని.

/ వ్యాసకర్త: సిపియం కృష్ణా జిల్లా పూర్వ కార్యదర్శి, సెల్: 9490098422 /

మోడీని గద్దె దించితేనే ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ

- అదానీ తప్పులేకుంటే జెపిసి ఎందుకు వేయడం లేదు?
- ప్రజా ఉద్యమాల ద్వారా ప్రత్యామ్నాయ విధానం
- సిపిఎం జనచైతన్య యాత్ర ప్రారంభంలో సీతారాం ఏచూరి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ హయాంలో మతోన్మాద రాజకీయం, కార్పొరేట్ దోపిడీ కవల పిల్లల్లా అవతరించాయని, దీనివల్ల దేశంలో దౌర్జన్యం పెచ్చురిల్లుతోందని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. బిజెపి దుర్మార్గమైన విధానాలతో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమాఖ్య స్ఫూర్తిపై దాడులు పెరిగాయని తెలిపారు. మోడీని గద్దె దించితేనే రాజ్యాంగం, ప్రజాస్వామ్య హక్కులు కాపాడబడతాయని, దేశంలో ప్రజా ఉద్యమాలు బలపడతాయని అన్నారు. 'రాజ్యాంగాన్ని రక్షిద్దాం... ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన జన చైతన్య యాత్రను శుక్రవారం వరంగల్‌లో సీతారాం ఏచూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మోడీ విధానాలను వ్యతిరేకించిన వారిపై దేశ ద్రోహులనే ముద్ర వేస్తున్నారని అన్నారు. దేశంలో 140 కోట్ల ప్రజలు తన వెనకే ఉన్నారనే భ్రమలో మోడీ ఉన్నారని, బిజెపికి దేశంలో కేవలం 37 శాతం మంది మాత్రమే ఓటు వేశారని, 63 శాతం వ్యతిరేకించారని గుర్తు చేశారు. బిజెపియేతర ప్రభుత్వాలను గవర్నర్లతో అస్థిరపర్చడం, ప్రతిపక్ష నాయకులను సిబిఐ, ఇడిలతో హింసించడం బిజెపి విధానంగా మారిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 5,500 మంది విపక్ష నేతలపై ఇడి కేసులు నమోదు చేస్తే వాటిలో కేవలం 0.5 శాతం కూడా రుజువు కాలేదని అన్నారు. ప్రతిపక్ష నాయకులను లొంగదీసుకునేందుకు ఇడి, సిబిఐలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. మోడీని ఓడించేవారే లేరనేది బోగస్ ప్రచారమే అని చెప్పడానికి ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి అధికారం కోల్పోయిందని, త్రిపురలో 14 మంది బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓడిపోయారని, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో పరాభవం చవిచూసిందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను, ప్రజలను దోచుకుంటోందని, కొత్త ఉద్యోగాలివ్వకుండా ఉన్న ఉద్యోగాలను రద్దు చేస్తోందని విమర్శించారు. ఉచితంగా రేషన్ ఇవ్వకపోతే 80 కోట్ల మంది నిరుపేదలు బతకలేని పరిస్థితి దాపురించిందంటే దేశ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రత్యామ్నాయ విధానాలతోనే దేశానికి మేలు జరుగుతుందని, అందుకు బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదానీ ఆర్థిక కుంభకోణంలో ఆయన తప్పులేకుంటే జెపిసి ఎందుకు వేయడంలేదని మోడీని ప్రశ్నించారు. కార్పొరేట్లకు పన్ను మినహాయింపు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల నుంచి బడా వ్యాపారులు తీసుకున్న రూ.11 లక్షల కోట్లు వసూలుకు ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేస్తేనే దేశానికి మేలు జరుగుతుందని తెలిపారు. మోడీని గద్దె దించితేనే ఇది సాధ్యమవుతుందన్నారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ దేశాన్ని చిన్నాభిన్నం చేసే దుర్మార్గమైన బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలను అడ్డుకోవడానికి ప్రజలంతా ఏకమవ్వాలని కోరారు. సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, చెరుపల్లి సీతారాములు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మతమార్పిడి కేసుల్లో 3 వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు

- రాష్ట్రాలకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : మత మార్పిడి వ్యతిరేక చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లకు కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేసేందుకు రాష్ట్రాలకు మూడు వారాల గడువును సుప్రీం కోర్టు శుక్రవారం ఇచ్చింది. ఈ చట్టాల కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని పేదల అవసరాలను తీర్చే మిషనరీలు మూతపడ్డాయని, 40మంది వ్యక్తులు పరారీలో వున్నారని సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావె తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ముందు పిటిషనర్ అయిన సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ తరపున సీనియర్ న్యాయవాది సియు సింగ్ వాదనలు వినిపించారు. తొమ్మిది రాష్ట్రాలు రూపొందించిన చట్టాలను కోర్టు విచారిస్తుంటే 10, 11వ రాష్ట్రాలు కూడా లవ్ జిహాద్, బలవంతపు మత మార్పిడి, తదితరాల పేరుతో ఇందులోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని సింగ్ వాదించారు. అందువల్ల ఎలాంటి జాప్యం లేకుండా ఈ కేసును కోర్టు విచారించాలని కోరారు. ఈ కేసును దీర్ఘకాలం పెండింగ్‌లో వుంచాలని తమ బెంచ్ భావించడం లేదని చంద్రచూడ్ అన్నారు. రాష్ట్రాలు తమ కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేసిన తర్వాత, పిటిషనర్లు తమ రిజాయిండర్లను రెండు వారాల్లోగా అందజేయాలని కోరారు.

ఐడిబిఐ ప్రయివేటీకరిస్తాం : దీపమ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ప్రయివేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తుహిన్ కాంత్ పాండే తెలిపారు. అనుకున్న ప్రణాళిక ప్రకారమే అమ్మకపు ప్రక్రియ సాగుతుందన్నారు.

సిసోడియాకు మరో 5 రోజులు ఇడి కస్టడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఐదు రోజులపాటు కస్టడీ పొడిగించారు. శుక్రవారం సిసోడియాను రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. ఆయన కస్టడీని మరో ఏడు రోజులు పొడిగించాలని ఇడి కోరింది.

ఇడి ఎదుటకు బుచ్చిబాబు

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కె కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు శుక్రవారం ఇడి విచారణకు హాజరయ్యారు. ఉదయం నుంచి దాదాపు తొమ్మిది గంటలపాటు విచారణ జరిగింది. వివిధ అంశాలపై బుచ్చిబాబును ఇడి ప్రశ్నించింది. ఈ నెల 20న కవితతో కలిసి బుచ్చిబాబును విచారించే అవకాశం ఉంది.

బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఎర కేసులో సిబిఐ సహా 15 మందికి సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : బిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో సిబిఐతో సహా 15 మంది ప్రతివాదులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ప్రతివాదుల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ సిఎంకు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఎమ్మెల్యేల ఎర కేసులో సిట్‌ను రద్దు చేస్తూ, కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో తెలంగాణ ఎసిపి దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.

ప్రతిపక్షాల సత్యాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

తదితర పార్టీల ఎంపీలు ఈ దీక్షలో పాల్గొన్నారు.

నిమిషాల్లో ఉభయ సభలు వాయిదా

పార్లమెంటు ఉభయ సభలు శుక్రవారం ప్రారంభమైన కొద్ది నిమిషాలకే ఈ నెల 20వ తేదీకి (సోమవారానికి) వాయిదా పడ్డాయి. శుక్రవారం అధికార, ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయ సభలు స్తంభించిపోయాయి. అదానీ వ్యవహారాన్ని ప్రతిపక్షాలు, రాహుల్ గాంధీ లండన్ వ్యాఖ్యల గురించి అధికార పార్టీ బిజెపి లేవనెత్తాయి. దీంతో అయిదవ రోజు కూడా పార్లమెంటు స్తంభించిపోయింది. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ప్రధాని మోడీ, మంత్రి పియూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపిలు కెసి వేణుగోపాల్, శక్తిసిన్హ్ గోహిల్ ప్రివిలేజ్ నోటీసులు ఇచ్చారు. అంతకుముందు రాజ్యసభలో కేంద్ర మంత్రి వి.మురళీధరన్ జాతీయ జ్యూట్ బోర్డుకు ఎన్నికల నిర్వహణ కోసం ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ఉభయ సభల్లో 3,382 నిమిషాల అంతరాయం

అయిదు రోజుల క్రితం తిరిగి ప్రారంభమైన పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా ఇంతవరకు 3,382 నిమిషాలపాటు ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఈ వారంలో కేవలం 218 నిమిషాల పాటు మాత్రమే సభా కార్యకలాపాలు సాగాయి. లోక్‌సభ ఈవారం ఐదు పనిదినాల్లో షెడ్యూల్ చేయబడిన 1,800 నిమిషాల్లో కేవలం 65 నిమిషాలు మాత్రమే పని చేసింది. అత్యల్పంగా గురువారం రెండు నిమిషాలు మాత్రమే పనిచేసింది. రాజ్యసభ 1,800 నిమిషాలకు గాను 152 నిమిషాలు మాత్రమే పని చేసింది. ఇందులోనూ ఆస్కార్ విజేతలను సత్కరించడానికే ఎక్కువ సమయం వెచ్చించింది. అత్యల్పంగా గురువారం కేవలం నాలుగు నిమిషాలు మాత్రమే పని చేసింది.



విద్యార్థిని మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గిరిజనులు

గిరిజనులపై తూటా!

- విద్యార్థిని హత్యపై ఆందోళన
- పోలీసు కాల్పుల్లో మరో విద్యార్థి బలి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో గిరిజన విద్యార్థినిపై సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారని ఆరోపిస్తూ గిరిజనులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వారికి న్యాయం చేయడానికి బదులు పోలీసులు కాల్పులు జరిపి, మరో గిరిజన విద్యార్థిని బలిగొన్నారు. మరో కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇండోర్‌లోని మౌ వద్ద ఈ దారుణం జరిగింది. రాష్ట్రంలోని ఖర్గోన్ జిల్లా మండ్లేశ్వర్‌కు చెందిన 22 ఏళ్ల విద్యార్థిని గురువారం అనుమానాస్పద స్థితిలో మరణించింది. మౌకు చెందిన యదునందన్ పాటీదార్, మరికొంతమంది విద్యార్థినిని అపహరించి, సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. నేరస్తులకు పోలీసులు అండగా ఉంటున్నారని, ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని విమర్శిస్తూ మౌలో విద్యార్థిని మృతదేహంతో గురువారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. వారిపై టియర్ గ్యాస్, లాఠీలు ఉపయోగించి చెదరగొట్టడంతోపాటు, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు. తరువాత అంత్య క్రియలు నిర్వహించారు. పోలీసు చర్యతో మరింత ఆగ్రహానికి గురైన సుమారు 500 మంది గిరిజనులు, విద్యార్థులు గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో మరోసారి మౌ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. వారిపై పోలీసులు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 18 ఏళ్ల విద్యార్థి బెరూలాల్ మృతి చెందాడు. అటుగా వెళ్తున్న ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు.

అట్టుడికిన అసెంబ్లీ

పోలీసులు కాల్పుల అంశం శుక్రవారం మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలను కుదిపివేసింది. ఉత్తర ప్రదేశ్‌లో హత్రాస్ ఘటనలో మాదిరిగానే ఇక్కడ కూడా నేరస్తులకు వంతపాడుతూ, మృతదేహానికి బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించారని కాంగ్రెస్ విమర్శించింది. విద్యార్థిని ఛాతీలో ఎందుకు కాల్చారని ప్రశ్నించింది. యువతికి, నిందితుడికి పరిచయం ఉందని, వేడినీటిని మరిగిస్తుండగా విద్యుత్ షాక్‌తో మరణించిందని కూడా చెబుతున్నారని హోం మంత్రి అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ వాకౌట్ చేసింది. ఈ విషయంపై ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.

సిజెఐపై ట్రోలింగ్ ఆపండి

- ట్రోలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రాష్ట్రపతికి ప్రతిపక్ష ఎంపీల లేఖ



న్యూఢిల్లీ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌ను సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేయడంపై తక్షణమే చర్య తీసుకోవాలని కోరుతూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. గత ప్రభుత్వ ఏర్పాటు సమయంలో మహారాష్ట్రలో గవర్నర్ పాత్రకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ఈ ట్రోలింగ్ జరుగుతోంది. "ఇటువంటి ఆన్‌లైన్ ట్రోలింగ్, న్యాయానికి సంబంధించిన కార్యాచరణలో దారుణంగా జోక్యం చేసుకోవడమే" అని రాష్ట్రపతికి రాసిన లేఖలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు వివేక్ థంకా పేర్కొన్నారు. దోషులపై తక్షణమే చర్య తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో ఆయనకు పలువురు ప్రతిపక్ష ఎంపీలు మద్దతిచ్చారు. కాంగ్రెస్ సభ్యులు దిగ్విజయ్ సింగ్, ప్రమోద్ తివారి, శక్తిసిన్హ్ గోహిల్, అఖిలేష్ ప్రసాద్ సింగ్, అమీ యాగ్నిక్, రంజిత్ రంజన్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, శివసేన (యుబిటి) సభ్యులు ప్రియాంక చతుర్వేది, ఆప్‌కి చెందిన రాఘవ చద్దా, ఎస్‌పికి చెందిన రామ్ గోపాల్ యాదవ్, జయ బచ్చన్ మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ లేఖ ప్రతిని న్యాయ శాఖ మంత్రికి, ఐటి శాఖ మంత్రికి, ఢిల్లీ పోలీసు కమిషనర్‌కి పంపారు. భారత అటార్నీ జనరల్‌కు కూడా ఇదే అంశంపై వారు ఫిర్యాదు చేశారు. ట్రోలింగ్‌కు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని థంకా డిమాండ్ చేశారు. న్యాయ యంత్రాంగాన్ని, భారత న్యాయమూర్తిని అప్రతిష్టపాల్జేసేలా ట్రోల్ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆ లేఖలో వారు కోరారు. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటు, గవర్నర్ పాత్ర విషయంలో కీలకమైన రాజ్యాంగపరమైన అంశాలపై డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తన వైఖరిని స్పష్టం చేసింది. ట్రోలర్లు గౌరవనీయులైన ప్రధాన న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేయడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మహారాష్ట్రలో పాలక పార్టీ ప్రయోజనాల పట్ల సానుభూతి చూపే ట్రోలర్లు వాడే మాటలు, ఇతర సమాచారం అత్యంత దుర్భరంగా వున్నాయి. న్యాయస్థానం పరిధిలో వున్న అంశంపై ఇలా మాట్లాడుతున్నారంటే అటువంటి వారికి కచ్చితంగా పాలక పార్టీ మద్దతు, తోడ్పాటు వుంటుందని ఆ లేఖ పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంలో పణంగా పెట్టబడేవి న్యాయం, న్యాయస్థానం పరువు, ప్రతిష్టలు, మన రాజ్యాంగ సంస్థల పేరు ప్రతిష్టలని పేర్కొంది. అందువల్ల ట్రోలర్లపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాల్సింది గా ఐటి, న్యాయ శాఖలను ఆ లేఖ కోరింది.

పుతిన్‌కు ఐసిసి అరెస్టు వారెంట్

ది హేగ్ : ఉక్రెయిన్‌లో యుద్ధ నేరాలకు పాల్పడ్డారంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) శుక్రవారం అరెస్టు వారెంటు జారీ చేసింది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల పంజరంలో చిలకగా ఐసిసి మారింది. అది చేసిన ఆరోపణలను రష్యా పదే పదే తిరస్కరిస్తూ వస్తోంది. ఉక్రెయిన్ నుంచి రష్యాకు పిల్లలను, వ్యక్తులను తరలించారన్న ఆరోపణలపై ఈ వారెంటు జారీ చేశారు.

ఇమ్రాన్ ఖాన్‌కు బెయిలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ అధినేత 70 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌కు ఎట్టకేలకు ప్రొటెక్షన్ బెయిలు లభించింది. తొమ్మిది ఉగ్రవాద కేసులు, ఒక సివిల్ కేసులో రక్షణాత్మక బెయిల్ కోసం బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో లాహోర్ హైకోర్టుకు వెళ్లారు. ఒక సివిల్ కేసు, ఎనిమిది ఉగ్రవాద కేసుల్లో ఇమ్రాన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై జస్టిస్ తారిక్ సలీమ్ షేక్, జస్టిస్ ఫరూక్ హైదర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించిన మీదట బెయిల్ మంజూరు చేసింది.



మీకోసం

కాకరకాయ ముక్కలకు కొద్దిగా పెరుగు, ఉప్పు కలిపి పది నిమిషాలు నానబెట్టి వేపితే త్వరగా వేగుతాయి

జీవన సౌరభం

ప్రపంచం మారాలని కోరుకోవడం కాదు, ఆ మార్పు మనతోనే మొదలవ్వాలి

బుజ్జాయి



అమ్మ చూపెను
చందమామను
బుజ్జాయి తినెను
హాయిగా గోరుముద్దను

నాన్న తెచ్చెను
కొయ్యగుర్రమును
బుజ్జాయి గుర్రమెక్కెను
ఆనందంగా ఊరేగుచుండెను

తాత తెచ్చెను
జామ పండును
బుజ్జాయి తినేను
ఎగిరి గెంతులేసెను

మామ వచ్చెను
కారు బొమ్మ తెచ్చెను
బుజ్జాయి పట్టుకొని బొమ్మను
చక్కగా ఆడుకొనెను

అత్త వచ్చెను
పలక తెచ్చెను
పలక మీద రాత రాసెను
బుజ్జాయి మురిసిపోయెను

నానమ్మ ఇచ్చెను
గ్లాసు పాలును
చక్కగా తాగేను
బుజ్జాయి నిదురపోయెను

మొర్రి గోపి, 88978 82202


తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి





నేను గీసిన బొమ్మ



దేవులపల్లి శ్రీ వర్ష, ఎల్‌కెజి, నంగునూర్, సిద్దిపేట జిల్లా.



కొయ్య చెక్కలతో బొమ్మలు

ఓ సన్‌జో సేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఆశ్రమంలో చికిత్స పొందిన ఆ యువకుడు అక్కడి దివ్యాంగులైన అనాథలను చూసి చలించి పోయాడు. వారి సేవకే తన జీవితాన్ని అంకితం చేశాడు. వయస్సు మీద పడినా వారికి వంట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తనకు వచ్చిన కళతో ఉచితంగా కొయ్య బొమ్మలు తయారీ చేసి పలువురికి అందిస్తున్నారు. అతనే ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెంకు చెందిన సుబ్రహ్మణ్యం.

సన్‌జో సేవాలయం ఆధ్వర్యంలో అనాథ ఆశ్రమంలో రకరకాల ప్రాంతాల నుంచి వచ్చిన అనాథలున్నారు. వారికి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నాయి. మతిస్థిమితం కోల్పోయినవారు, వృద్ధులూ ఉన్నారు. రక్త సంబంధీకుల ప్రేమానురాగాలు లేని వారిని చూసిన సుబ్రమణ్యంకు జాలి వేసింది. వారి ధీనగాధలను తెలుసుకుని హృదయం చలించింది. వారందరినీ తనవాళ్లగా భావించాడు. తనకు చేతనైన వంట చేసి, ఆత్మీయుడయ్యాడు.


చెన్నైలోని వేలూరుకు చెందిన సుబ్రహ్మణ్యం యుక్త వయస్సులో మద్యం, సిగరెట్లకు బానిసయ్యాడు. తండ్రి ఉద్యోగ రీత్యా కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ కూడా సుబ్రహ్మణ్యం మత్తుపదార్థాలకు అలవాటవ్వడంతో ఇంట్లో వారు వదిలేశారు. ఓ రోజు టీ దుకాణం ముందు సిగరెట్ కాలుస్తుండగా నిప్పు ఒంటిపై పడి దుస్తులు అంటుకుని ఒళ్లంతా కాలిపోయింది. శరీరంలో అక్కడక్కడ గాయాలతో పడి ఉండగా ఓ సిస్టర్ చూసింది. చర్చి ఆధ్వర్యంలో నిర్వహించే ఆశ్రమంకు తీసుకెళ్లి, చికిత్సలు అందించింది. అక్కడ ఉండే వారంతా అనాథలు, దివ్యాంగులు. కోలుకున్న ఆయన అక్కడ ఉండే మానసిక దివ్యాంగులకు సేవ చేయాలని సంకల్పించాడు.



అప్పటి నుంచే వారికి సేవలు చూస్తూ ఉండిపోయాడు.

యువకుడిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో ఒక రోజు కొయ్య బొమ్మలు తయారు చేసే వ్యక్తిని బాగా గమనించాడు. అతని పనితీరు చూసి, తానూ కొయ్యలు తీసుకుని కొడవలితో బొమ్మను తయారు చేసేందుకు ప్రయత్నించాడు. తను నిత్యం చూసే చర్చిని చెక్కముక్కలతో చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అప్పటి నుంచీ కొయ్య బొమ్మల తయారీలో ప్రావీణ్యం సంపాదించారు. సృజనాత్మకంగా బొమ్మలు చేయడం ప్రారంభించాడు. ఆయన ఈ పనిలో ఏకాగ్రత పెట్టడంతో మద్యం, మత్తు వ్యసనాలకు నెమ్మదిగా దూరమయ్యాడు.





వంట చేస్తూనే...

దేవుళ్ల బొమ్మలతో పాటూ ఇంట్లో అలంకరణకు వివిధ బొమ్మలు తయారు చేసి ఇచ్చేవాడు. కరోనా సమయంలో హైదరాబాద్ నుంచి యర్రగొండపాలెంలోని సన్‌జో సేవాలయానికి వచ్చారు. ఇక్కడ ఉండే 20 మంది మానసిక వికలాంగులకు వంట చేసి పెడుతున్నాడు. దాతలు ఇచ్చిన నిత్యవసర సరుకులను వంట గదిలో భద్రపరుస్తూ, రోజుకొక ఆహారం వండి పెడుతున్నాడు. పాయసం, దద్దోజనం, పులిహోర, పప్పు, సాంబారు, మాంసం, చేపలు, రొయ్యలు ఫ్రై చేసి పెడుతున్నాడు. వారంతరాల్లో చికెన్ బిర్యాని, వెజ్ బిర్యాని వండి పెడుతున్నాడు. అందరూ కడుపు నిండా తిన్న తరువాతే తాను తింటూ అందరికీ బంధువయ్యాడు.

ఆకట్టుకునేలా..

గ్యాస్ సౌకర్యం లేకపోవడంతో కట్టెపొయ్యిల మీద అప్పుడప్పుడు వంట చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో దగ్గర్లో ఉన్న ఓ కొయ్యల కట్టింగ్ మిషన్ దగ్గరకు సుబ్రమణ్యం వెళుతున్నాడు. పనికిరాని, పక్కన పడేసిన టేకు, మామిడి, తుమ్మ చెట్ల చెక్క ముక్కలు, చిన్న చిన్న కొయ్యలు తెస్తాడు. వాటిలో బొమ్మకు ఉపయోగపడే మంచి కొయ్యలను, చెక్కలను వేరు చేసి ఆకర్షణీయ బొమ్మలు తయారుచేస్తున్నాడు. ఇళ్లలో టీవీ, ఫ్రిజ్, టేబుల్‌పై ఆకర్షణగా ఉంచే పక్షులు, చేపలు, పడవ బొమ్మలు తయారు చేస్తోన్నాడు. ఏ ఆకారంలో బొమ్మ కావాలో చెబితే అదే ఆకృతిలో బొమ్మ చేయడం అతని ప్రత్యేకత. క్రిస్మస్ పండగ సమయాల్లో క్రీస్తు, మేరీ మాత, చర్చి బొమ్మలు చాలానే చేస్తాడు. ఇంటి ముందు ద్వారబంధాలకు అలంకరించే అందమైన రూపాలను చెక్కి ఉచితంగా అందిస్తుంటాండు. డెబ్బై రెండేళ్ల వయస్సులో కూడా అలసిపోకుండా దివ్యాంగులకు సేవ చేస్తూ, రకరకాల బొమ్మలను సుబ్రమణ్యం చేయడం చూసి దాతలు, స్థానికులు అభినందిస్తున్నారు.

– వలీ సాహెబ్, యర్రగొండపాలెం, విలేకరి

సేవతోనే తృప్తి

అనాథ, మానసిక వికలాంగుల ఆకలి తీర్చడంలోనే నాకు సంతృప్తి ఉంది. ఊపిరి ఉన్నంత వరకు వీరికి సేవ చేస్తాను. ఆశ్రమాన్ని సందర్శించేందుకు వచ్చే దాతలకు నా విజ్ఞప్తి ఒక్కటే. ఇళ్లలో జరుపుకొనే శుభ కార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను వృధాగా పడేయకుండా అనాథలకు అందించి వారి ఆకలి తీర్చమని కోరుతున్నా. బొమ్మ తయారు చేయడం నాకు సరదా అంతే.

సుబ్రహ్మణ్యం, యర్రగొండపాలెం.

సాధారణ జ్వరమా...?



వాతావరణం మారి పిల్లలకు, పెద్దలకు దగ్గు, జ్వరాలు వస్తున్నాయి. జ్వరం 101 డిగ్రీల ఫారిన్ హీట్ కన్నా తక్కువగా వుంటే, ప్రత్యేకమైన వైద్యం అవసరం లేదు. ద్రవ పదార్థాలు తీసుకుంటే సరిపోతుంది. మందులు వాడుతూనే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. జ్వరం 103 డిగ్రీల ఫారిన్ హీట్ దాటి 2 గంటల కంటే ఎక్కువసేపు ఉన్నా, వచ్చి 2 రోజులు దాటినా, టెంపరేచర్ 105 డిగ్రీస్ ఫారిన్‌హీట్ దాటినా, వైద్యుడిని సంప్రదించాలి.

ఈ జ్వరంతో పాటు కళ్లలో నీళ్లు కారటం, బాగా నీరసం, వాంతులు వంటి లక్షణాలు కనిపించినా రోగికి ఎక్కువగా నీళ్లు తాగించాలి. దీని వల్లన శరీరం డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. తర్వాత రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారంతో బాగా నిద్రపోవాలి. ముఖ్యంగా రోగి ఆందోళనకు గురికాకుండా చూసుకోవాలి.

కాచి వడబోసి చల్లార్చిన నీటిని తాగాలి. క్లోరినేషన్ చేసిన నీటిని తీసుకోవాలి. కొబ్బరి నీళు,, నిమ్మరసం, గంజి, పళ్ల రసాలు తాగాలి. మందులతో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని గంట గంటకు తాగుతుండాలి. దాంతో జ్వరం తగ్గి త్వరగా కోలుకుంటారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మున్సిపల్ కార్మికుల ఆందోళనలు



విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం రాష్ట్రంలో పలుచోట్ల ధర్నాలు, ఆందోళనలు చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జరిగిన ఈ ఆందోళనల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మున్సిపల్ కార్మికుల రెగ్యులరైజేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, లేకుంటే సమ్మె చేయడానికి కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు మంజూరు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఆందోళనలు నిర్వహిస్తున్నా ఈ ప్రభుత్వానికి, అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. ధర్నా అనంతరం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారికి సమస్యలు పరిష్కారం కోరుతూ వేర్వేరుగా నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ధర్నాలో యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. అనంతపురంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ ఆర్‌డి పివివిఎస్.మూర్తికి వినతిపత్రం అందజేశారు. కర్నూలు, ఏలూరు, పశ్చిమగోదావరి, కడప జిల్లాల్లో ఆందోళనలు చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

19న ఎపిఆర్‌పిఎ మహాసభ

ప్రజాశక్తి - విజయవాడ

ఆంధ్రప్రదేశ్ అల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) రాష్ట్ర 2వ మహాసభ ఈ నెల 19న కాకినాడలో జరగనుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఎ.శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, ఇపిఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్స్ జాతీయ నాయకులు ధర్మజన్ (కేరళ), అతుల్ ధిగే (మహారాష్ట్ర), అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్ కుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తమాసు ఫణీంద్ర (36), భార్య సుధా (28), తల్లి రాజేశ్వరి (55)తో కలిసి గొల్లపూడిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం ఫణీంద్ర అన్న ప్రవీణ్ ఫోన్ చేశారు. ఎంతసేపటికి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి అపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. ఎంతసేపటికీ స్పందించక పోవడంతో తలుపులు పగలగొట్టారు. లోపలికి వెళ్లి చూడగా ఫణీంద్ర, ఆయన భార్య సుధా వంట గదిలోని హుక్‌కు వేలాడుతూ కనిపించారు. తల్లి రాజేశ్వరి పక్క గదిలోనే విగతి జీవిగా కనిపించింది. భవానీపురం సిఐ ఉమర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సంఘటనా స్థలంలో ఫణీంద్ర రాసినట్లు ఉన్న సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే తాము ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్‌లో ఫణీంద్ర పేర్కొన్నాడు. పోలీసులు ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫణీంద్ర సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారుకు పట్టభద్రుల సెగ

(మొదటిపేజీ తరువాయి)

మేజిక్ రాకపోవంతో ఎలిమినేషన్ పద్ధతిలో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు.

పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల నియోజకవర్గంలో వైసిపి, టిడిపి మధ్య నువ్వా... నేనా అన్నట్టుగా వస్తున్న ఫలితాలు ఉత్కంఠతను రేకెత్తిస్తున్నాయి. మొత్తం 2,44,307 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 15,104 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 1,92,018 ఓట్లు లెక్కించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎనిమిది రౌండ్లు పూర్తయ్యే సరిగా వైసిపి అభ్యర్థి వెన్నపూస గోపాలరెడ్డికి 74,678 ఓట్లు, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి 73,229 ఓట్లు వచ్చాయి. 1449 ఓట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థి ఉన్నారు. పిడిపి అభ్యర్థి పోతుల నాగరాజుకు 15,254 ఓట్లు వచ్చాయి.

బడ్జెట్‌లో కొత్తదనం లేదు

కేటాయింపులు, ఖర్చులకు పొంతన ఏదీ?: మండలి ప్రతిపక్షనేత యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో, గవర్నరు ప్రసంగంలో ఎలాంటి కొత్తదనం లేదని శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆఖరి ఏడాదిలో కూడా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వలేదని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంకెలు ఘనంగా చూపుతూ, ఖర్చు మాత్రం చాలా తక్కువ పెట్టడం వల్లే రాష్ట్రంలో ఫిజికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దెబ్బతిందని తెలిపారు. దీనిని మెరుగుపరచడానికి నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే చాలా పథకాలు తీసేశారని అర్థమవుతోందన్నారు. సంక్షేమానికి ఎక్కువ నిధులు వెచ్చిస్తే పేదరికం, అసమానతలు ఎందుకు పెరిగాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకునే డిబిటి అమల్లో దేశంలో 19వ స్థానంలో ఉన్నామని చెప్పారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసినట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో నిరూపితమైందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అసెంబ్లీ వద్ద టిడిపి నిరసన

అసెంబ్లీ వద్ద టిడిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఫైర్ స్టేషన్ నుంచి అసెంబ్లీ వరకు ప్లకార్డులతో అసెంబ్లీకి వచ్చారు. జగన్ ప్రభుత్వంలో ధరలు పెరిగాయని ప్లకార్డులు పట్టుకుని నడుచుకుంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆధ్వర్యాన అసెంబ్లీకి చేరుకున్నారు. ప్రజా సమస్యల గళం వినపడకుండా శాసనసభలో తమ గొంతు నొక్కారని టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అసెంబ్లీ బయట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర మినహా మిగిలిన జిల్లాల్లో తూర్పు కాపులకు సెంట్రల్ ఒబిసి రిజర్వేషన్ ఎందుకు ఇవ్వడం లేదని నిరసన తెలిపారు.

గెలిపించిన రాహుల్, జడేజా

పేసర్ల దెబ్బకు ఆసీస్ కుదేల్ ● మిచెల్ మార్ష్ అర్ధసెంచరీ
తొలి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు



కేఎల్ రాహుల్ 75(నాటౌట్) పరుగులు

ముంబయి: వాంఖడే వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ జట్టు భారత పేసర్ల ధాటికి 188పరుగులకే ఆలౌట్ కాగా.. ఛేదన లో భారతజట్టు ఐదు వికెట్లు కోల్పోయి 191పరుగులు చేసి గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ హెడ్(5) నిరాశపరిచినా.. కెప్టెన్ స్మిత్, మిఛెల్ మార్ష్ కలిసి 2వ వికెట్‌కు 72పరుగులు జతచేశారు. ఆ తర్వాత స్మిత్(22) ఔటైనా.. మిఛెల్ మార్ష్(81) ధాటిగా ఆడుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో ఆస్ట్రేలియా జట్టు ఓ దశలో 4వికెట్ల నష్టానికి 169పరుగులు భారీస్కోర్ చేసేలా కనిపించింది. ఆసీస్ జట్టు 19పరుగుల వ్యత్యాసం లో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. మిచెల్ మార్ష్ టాప్ స్కోరర్. భారత బౌలర్లలో షమీ, సిరాజ్ కు మూడేసి, జడేజాకు రెండు, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యా తలా ఒక వికెట్ దక్కాయి.

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా టాపార్డర్ ఘోరంగా విఫలమైంది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (3)ను స్టొయినిస్ ఔట్ చేయగా.. తర్వాత విరాట్ కోహ్లీ(4), సూర్యకుమార్(0)ను వరుస బంతుల్లో స్టార్క్ ఔట్ చేసి భారత్‌ను దెబ్బ కొట్టాడు. ఆ దశలో క్రీజ్‌లో కుదురుకుని ఆడిన శుభమన్ గిల్(20)ను కూడా స్టార్క్ ఔట్ చేశాడు. దీంతో భారతజట్టు 39పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్య(25)తో కలిసి కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. కానీ, కీలక సమయంలో హార్దిక్ ఔట్ కావడంతో భారత్ 83పరుగులవద్ద ఐదో వికెట్‌ను చేజార్చుకుంది. ఈ క్రమంలో ఆల్‌రౌండర్ జడేజా- రాహుల్ కలిసి 6వ వికెట్‌కు 108 పరుగులు జతచేసి మ్యాచ్ ముగించారు. కేఎల్ రాహుల్ (75నాటౌట్), రవీంద్ర జడేజా (45నాటౌట్) కీలక పరుగులు చేశారు. దీంతో భారత్ 39.5ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 191పరుగులు చేసి గెలిచింది. ఆసీస్ బౌలర్లు స్టార్క్‌కు మూడు, స్టొయినీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలువగా.. రెండో వన్డే విశాఖ వేదికగా ఆదివారం(19న) జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జడేజాకు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి)సిరాజ్ 5, మిఛెల్ మార్ష్ (సి)సిరాజ్ (బి)జడేజా 81, స్మిత్ (సి)రాహుల్ (బి)హార్దిక్ 22, లబూషేన్ (సి)జడేజా (బి)కుల్దీప్ 15, ఇంగ్లిస్ (బి)షమీ 26, గ్రీన్ (బి)షమీ 12, మ్యాక్స్‌వెల్ (సి)హార్దిక్ (బి)జడేజా 8, స్టొయినీస్ (సి)శుభ్‌మన్ (బి)షమీ 5, అబట్ (సి)శుభ్‌మన్ (బి)సిరాజ్ 0, స్టార్క్ (నాటౌట్) 4, జంపా (సి)రాహుల్ (బి)సిరాజ్ 0, అదనం 10. (35.4ఓవర్లలో ఆలౌట్) 188పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/77, 3/129, 4/139, 5/169, 6/174, 7/184, 8/184, 9/188, 10/188 **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, హార్దిక్ 5-0-29-1, శార్దూల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్‌బి) స్టొయినీస్ 3, శుభ్‌మన్ (సి)లబూషేన్ (బి)స్టార్క్ 20, కోహ్లి (ఎల్‌బి) 4, సూర్యకుమార్ (ఎల్‌బి)స్టార్క్ 0, కేఎల్ రాహుల్ (నాటౌట్) 75, హార్దిక్ పాండ్యా (సి)గ్రీన్ (బి)స్టొయినీస్ 25, జడేజా (నాటౌట్) 45, అదనం 19. (39.5ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 191పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/16, 3/16, 4/39, 5/83 **బౌలింగ్:** స్టార్క్ 9.5-0-49-3, స్టొయినీస్ 7-1-27-2, అబట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0

సెమీస్‌కు త్రీసా-గాయత్రి

సింగిల్స్‌లో ముగిసిన పోరు



లండన్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో భారత యువ జంట సంచలన నమోదు చేయగా.. పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరు ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట 21-14, 18-21, 21-12తో చైనాకు చెందిన టాప్‌సీడ్ లీ-లూలపై పోరాడి నెగ్గారు. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న 17వ ర్యాంకర్ త్రీసా-గాయత్రి.. రెండో గేమ్‌లో పోరాడి ఓడారు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్ మొదటినుంచే మెరుగైన ప్రదర్శనను కనబరిచారు. మ్యాచ్ ముగించేందుకు భారతజోడీ సుమారు 64నిమిషాలసేపు పోరాడాల్సి వచ్చింది. సెమీస్‌లో భారత జోడీ కొరియాకు చెందిన లీ-బెక్‌లతో తలపడనున్నారు. త్రీసా-గాయత్రి జంట వరుసగా రెండోసారి ఈ టోర్నీలో సెమీస్‌లోకి ప్రవేశించారు. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరు ముగిసింది. గురువారం రాత్రి జరిగిన పోటీల్లో కిదాంబి శ్రీకాంత్ 17-21, 15-21తో నరోకా(జపాన్) చేతిలో, లక్ష్యసేన్ 13-21, 15-21తో ఆంటోన్సెన్(డెన్మార్క్) చేతిలో ఓడారు. ఇక హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ 20-22, 21-15, 17-21తో హోరాహోరీ పోరులో గింటింగ్(ఇండోనేషియా) చేతిలో ఓడాడు.

అంతర్జాతీయ క్రికెట్‌కు టిమ్ పైన్ గుడ్‌బై



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ టిమ్ పైన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. బెల్లెరివ్ ఓవల్‌లో క్వీన్స్‌లాండ్‌తో జరిగిన టాస్మానియా షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్ డ్రాగా ముగిసిన తర్వాత పైన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. స్టీవ్ స్మిత్ తర్వాత ఆస్ట్రేలియా టెస్టు జట్టుకు 46వ కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2018నుంచి ఆసీస్ టెస్ట్ జట్టుకు మూడేళ్లు కెప్టెన్‌గా కొనసాగాడు. ఆస్ట్రేలియా తరపున 23 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించిన 38ఏళ్ల టిమ్ పైన్ మొత్తం 35 టెస్టులు ఆడాడు. వికెట్ కీపర్‌గా 157మందిని ఔట్ చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68